# "క్రొత్త సంవత్సరంలో మన కర్తవ్యం"

"సాయిబాబా"

"దేశంలో ఎన్నో మందిరాలు, ఆశ్రమాలూ వున్నాయి. ఎందరో స్వాములు విరివిగా ప్రసంగాలు, పత్రికలు, గ్రంధాల ద్వారా ధర్మప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ, మరోవంక సమాజంలో ఎక్కడ చూచినా అవినీతి, హత్యలు, హింసాకాండ, దోపిడీలు, మత కలహాలు జరుగుతూనే వున్నాయి. కారణం?

ఆధ్యాత్మికత అన్నది మన ప్రాపంచిక జీవితంలో ఎట్టి సంబంధమూ లేనిదన్న దురభిప్రాయమే. నిత్య జీవితంలో అనుక్షణమూ ధర్మంపాటించిన వారికి మాత్రమే ఆధ్యాత్మవిద్య సాధ్యం. విత్తనము, దానినుంచి వచ్చే మొక్కా సరియైనవైతేగాని కాయలు, పండ్లు మంచివిగా వుండవు. ధర్మప్రచారంలేని ఆధ్యాత్మప్రచారం పునాదులు లేని భవనం వంటిది.

నిజానికి ప్రతివారికి ధర్మం ఆచరించాలనే వుంటుంది. ఏది ధర్మమోగూడ తెలుసు. కాని కోరికలు బలీయమవడం వలన వాటిని ఎలాగైనా తీర్చుకునే ప్రయత్నంలో సాటివారికి, సమాజానికీ ఎంత కీడు జరుగుతుందో, అందు వలన వారు ఎంత బాధపడతారో మనకు తట్టదు. అదే మనం ధర్మం ఆచరించలేకపోవడానికి కారణం. దీనినే సాటి జీవులపట్ల ప్రేమలేకపోవడం అంటాము. కాని యీ విషయం మనస్సుకు యిలా తెలియడమే చాలదు. మనలో యిలా తెలుసుకునే మేధ, లేక యోచనాశక్తికంటే యిష్టాయిష్టాల రూపంలో వుండే భావశక్తే బలంగా వుంటుంది. పూర్వపుణ్యంవలన శ్రీ సాయి వంటి సద్గురువు యొక్క కృపను అనుభవిస్తేగాని మన కోర్కెలు కష్టాలు తీర్చుకోవడానికి వక్రమార్గం అనుసరించనక్కరలేదన్న జ్ఞానం కల్గదు. ఒకసారి ఆయన కృపను చవిచూచాక మనకేది శ్రేయస్కరమో అది ఆయనకే బాగా తెలుసునని, అది నెరవేర్చేసామర్థ్యం ఆయనకున్నదనీ తెలుస్తుంది. కోరికల బలం సడలుతుంది. ధర్మం ఆచరించడానికి మనలో సంసిద్ధత ఏర్పడుతుంది.

కాని ఏది ధర్మమో, దాని సూక్ష్మమేమో, పూర్తిగా తెల్పగలవారు సాయివంటి పూర్ణపురుషులే. కనుక వారి యొక్క ప్రతి చేత, ప్రతిమాట సాధ్యమయినంత వివరంగా తెలుసుకోవడం అవసరం. అవి మాత్రమే మనకు మార్గదర్శకం కాగలవు. ఆయన ఏఏ సందర్భాలలో ఎవరికి ఏమి బోధించారో తెలుసుకోవడం ఒక్కటే మనకు తరుణోపాయం. అందుకే శ్రీ ఆచార్య భరద్వాజ, రెండు దశాబ్దాలు అహర్నిశలూ పరిశోధించి "శ్రీ సాయిచరిత్ర","సాయి సన్నిధి" వ్రాశారు. ఇలాగాక మనభావాలకు అనుగుణమైన సూక్తులు, లీలలు ఎన్నుకొని 'సాయి చెప్పిన మార్గమిదే' నంటూ ప్రజలకు బోధించబోవడం ఆ సద్గురువు పట్ల, ప్రజలపట్లా ద్రోహమే అవుతుంది.

శ్రీ సాయి, ఆయన వంటి మహాత్ములు ఏమి చెప్పారో వాటినెలా ఆచరించి చూపారో ప్రతి ఒక్కరికీ తెల్పడమే మన లక్ష్యం గావాలి. 'సాయిబాబా' పక్షపత్రిక లక్ష్యం యిదొక్కటే. పెనుభూతంలా ప్రపంచాన్ని కబళిస్తున్న అవినీతినుండి, తమ ప్రాబల్యంకోసం సాయిబోధనుగూడ వక్రీకరించి తమ స్వంతభావాలను ప్రజలపై రుద్దచూచే కపట బోధకుల బారినుండి మనను, సాటివారినీ రక్షించుకొని సాయి చూపిన మార్గాన్ని స్వచ్ఛంగా వుంచుకోవడం ఎంతో ముఖ్యం. 'సాయిబాబా' పత్రిక చేస్తున్న యిట్టి సాయి ధర్మ ప్రచార యజ్ఞంలో, ఈ ధర్మ యుద్ధంలో, ప్రతిఒక్కరూ పాల్గొని, సాటివారందరికీ యీ పత్రిక అందేందుకు యధాశక్తి కృషిచేయాలని మా విన్నపం.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 27 | జనవరి 2010 | సంచిక: 9

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి

**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | |
|---|---|
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |

**చిరునామా**

శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, మంగమూరు డొంక, ఒంగోలు-2.
ఫోన్ నెం: 08592 - 233271
website: www.saibharadwaja.org

www.saimasterforums.org

# విషయసూచిక:


| | | |
|---|---|---|
| 1. | క్రొత్త సంవత్సరంలో మన కర్తవ్యం | 01 |
| 2. | నూతన సంవత్సర సందేశం | 03 |
| 3. | సత్సంగము | 05 |
| 4. | వార్తాలాపము - సీరియల్ | 06 |
| 5. | సంబరాలు తెచ్చింది సంక్రాంతి | 08 |
| 6. | ధర్మం నాడు-నేడు | 09 |
| 7. | శ్రీ భరద్వాజ లేఖామృతము | 10 |
| 8. | శుభాకాంక్షలు | 12 |
| 9. | శ్రీ దత్తలీలామృతము | 14 |
| 10. | శ్రీ సాయి సచ్చరిత్ర | 18 |
| 11. | పురుషసింహం | 20 |
| 12. | అల్లా చూపిన క్షమకు బానిస మాలిక్ దినార్ | 23 |
| 13. | హజరత్ తాజుద్దీన్‌బాబా జననము-సాధన | 25 |
| 14. | జీవన విధానం | 28 |
| 15. | బాబా తోడుగా వుండి నడిపిస్తున్నారు!!! | 31 |


## ధన్యవాదములు

ఈ సంచిక ముద్రణకు ఆర్థిక సహకారము అందించిన వారు:
www.messageofthemasters.org
వీరిని శ్రీ సాయి మాస్టర్ సదా అనుగ్రహించుగాక!

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.
శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్‌కు ఎటువంటి బాధ్యతా లేదు.

www.saibharadwaja.org www.saimasterforums.org

# నూతన సంవత్సర సందేశం

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రియ సాయి సోదరీ సోదరులకు,

శ్రీ సాయినాథుడు సకల శుభములననుగ్రహించి తమ అవతార కార్యమైన లోకహితానికి నిమిత్తమాత్రులై నిష్కామకర్మమైన భగవత్ సేవ చేయించుకోవాలని ఆశిస్తున్నాను. ఈ సందర్భంలో కర్తవ్యాన్ని స్వల్పంగా స్మరిద్దాము.

శ్రీ కృష్ణుడు 'భగవద్గీత' (4:34)లో 'తత్వదర్శి' (అనగా బ్రహ్మజ్ఞాని), శ్రోత్రీయుడు(శృతులెరిగినవాడు) అయిన గురువును ముముక్షువు సేవించాలని చెప్పాడు. ఆయన ఆదర్శంగా సాందీపనికి శిష్యుడయ్యాడు. ధర్మ విగ్రహుడైన రాముడుగూడ వశిష్ఠ విశ్వామిత్రులను సేవించి మనకు ఉత్తమ కర్తవ్యం చూపాడు. అటువంటి జ్ఞానులు తమరూపమేనని శ్రీ కృష్ణుడు– "జ్ఞానీత్వాత్మవమే మతమ్" అని చెప్పాడు. ఆత్మజ్ఞాని, భగవత్స్వరూపియై శృతులెరిగినవాడే గురువని శ్రీగురుగీత, ఉపనిషత్తులు కూడా చెప్పాయి.

అయితే "భగవద్గీత"లో శ్రీకృష్ణుడు– "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే"–"ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించేవారు కొన్ని వేలమంది మానవులలో ఏ ఒక్కరో వుంటారనిగూడ చెప్పారు. ఇక బ్రహ్మజ్ఞానియైన గురువులెందరుంటారు యీ కలియుగంలో? పురాణాలన్నీ కలియుగంలో బ్రహ్మజ్ఞానం లేకనే, ధనము, కీర్తి మొ॥నవి ఆశించి గురుత్వము వహిస్తారని హెచ్చరించాయి. అటువంటప్పుడు రాముడు, కృష్ణుడు చెప్పినట్లు మనకు సద్గురువు లభించేదెలా అన్నది సమస్య అవుతుంది.

ఈ కారణంగా దత్తాత్రేయస్వామి స్వయంగా అట్టి సద్గురువుగా అవతరించి మన ధర్మానికి ఆలంబనంగా నిలచారు. ఈ అవతార పరంపర శ్రీ పాదవల్లభుడు, శ్రీనృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ స్వామి సమర్థ, శ్రీ శిరిడీ సాయిబాబా. ఈ అవతారాలందరికీ సమానమైన ధర్మాలు కొన్ని గుర్తించవచ్చు–

1) వీరిలో ఎవరూ తాము అవతార పురుషులమని, దత్తావతారములమనీ ప్రకటించకుండడం.

2) ఎట్టి సంస్థలూ లేకుండుట, సర్వసంగ పరిత్యాగము

3) స్వాశ్రమధర్మాన్ని 'తు'చ తప్పకుండా పాటించడం;

4) ఎటువంటి చమత్కారాలూ చేయకుండడము, వారు సంకల్పించకనే దివ్యలీలలు వాటికై అవే జరుగుట.

5) భిక్షాటనమే వారివృత్తి;

6) శరీర పరిత్యాగం తర్వాతగూడ అదేరూపంతో నేటికీదర్శనముతో తమ సద్గురుధర్మాన్ని నిర్వర్తిస్తుండగల్గడం

7) వారి సేవలో ప్రధానాంశంగా వారి చరిత్ర పారాయణమే కల్గియుండుట.

8) వారికీ వారిని సేవించే భక్తులకు మధ్యవర్తులుగా, గురువులుగా ఎవరూ అవసరం లేకుండుట.

9) వారు ఏ సాధుపుంగవుని రూపంలో అనుగ్రహించదలచినా ఆ విషయం స్వప్నంలో ఆదేశంగా తెల్పుట.

ఈ సాంప్రదాయాన్ని అనుసరించి మనంగూడ శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర, ప్రబోధామృతము, శ్రీగురుచరిత్రలు ప్రధానంగా పారాయణ చేయాలి. సాటివారిచేత పారాయణము, శ్రవణమూ చేయించాలి.

ఈ సాంప్రదాయాన్ని పాటించి 17వ శతాబ్దం నుండి మహారాష్ట్రలో

www.saibharadwaja.org www.saimasterforums.org

"శ్రీగురుచరిత్ర" పారాయణ చేసి, అటువంటి మహాత్ములను సేవించాలన్న తీవ్రమైన ఆకాంక్షను అచ్చటి ప్రజలు పొందడంచేత 1850-1950 మధ్యలో ఉద్దండులైన దత్తావతారాలు-శ్రీ అక్కల్కోట స్వామి, శిరిడీ సాయిబాబా, తాజుద్దీన్‌బాబా, గజానన్ మహరాజ్, ధునీవాలాదాదా, నారాయణమహరాజ్ (ఖేడ్‌గావ్) ఆ రాష్ట్రంలోనే చేరడం జరిగింది. మనముగూడ ఆ పద్ధతిలో వారి చరిత్రలు పారాయణ శ్రవణము చేయించి, అటువంటి మహనీయుల్ని సేవించాలన్న తపన మన ప్రజలలో కొద్దిదశాబ్దాలు కల్గిస్తే యిక్కడగూడ అలాంటి మహనీయులే అవతరించి యీదేశం భవితవ్యమే మారిపోగలదు. ఇది యీ సాంప్రదాయం వారి మహిమ చవిచూచిన మన ప్రధాన కర్తవ్యం. ఈ రూపాలలోని గురువును సేవించే మనమందరమూ "గురుబంధువులము".

ఈ బాంధవ్యం అన్నింటికంటే సన్నిహితమైనది, పవిత్రమైనదీ కనుక ఎటువంటి వికారాలు, అధిక న్యూనతలు మన మధ్య రాకూడదు. సాటివారు తెలియక వాటికి తావిచ్చినా మనము అవగాహనతో, సోదరభావంతో నెమ్మదిగా యుక్తితో వారిని వాటిబారినుండి విడుదల చేయాలిగాని పట్టుదలకుదిగి సాధించుకొనడం తగదు. మనమధ్యవుండే ప్రేమాభిమానాలు మన గురుమూర్తిపై మనకున్న భక్తిలో భాగము. మధ్యవర్తులైన గురుత్వాలనంగీకరించక ముక్కు సూటిగా ఈ బాటన నడవడము, సాటివారికీ తెల్పి నడిపించడమూ మన కర్తవ్యం. ఇందుకు తగిన శిక్షణను ప్రజల కందింపజేసే కేంద్రంగా మందిరాన్ని నిర్మాణం కాకముందునుండే రూపొందించుకోవాలి. ఇలా మనచేత ఆ హితము, జగద్హితమూ ఆయిన యీ కార్యక్రమం నిర్దుష్టంగా జరిపించుకొనమని సాయినాధుని ప్రార్థిస్తూ.

సాయిసేవలో

భరద్వాజ

## "సాయిబాబా" పాఠకులకు విజ్ఞప్తి

మీ ''సాయిబాబా''లో ''ద్వారకామాయి అనుభవమంటపం" పున: ప్రారంభం!!! శ్రీ సాయినాధుని, శ్రీ సాయి మాస్టర్ కృపవలన, పారాయణ ఫలితంగానూ మీకు కలిగిన అనుభవాలను మీరు మాకు పంపిస్తే "ద్వారకామాయి అనుభవమంటపం" అనే శీర్షిక క్రింద నెలకు ఒకరి అనుభవం ప్రచురించబడుతుంది. మీరు అనుభవాలు పంపవలసిన చిరునామా –

" Editor, Sai Baba Monthly Magazine,
Sri Master Universal Sai Trust, M.M.Donka,
Ongole - 523 002 "

– "సాయిబాబా"

జనవరి 27వ తారీకు శ్రీ తాజుద్దీన్ బాబాగారి జన్మదిన సందర్భంగా వారి దివ్యచరిత్ర **"శ్రీ హజరత్ తాజుద్దీన్‌బాబా చరిత్ర"** పారాయణ చేయండీ, చేయించండి!!

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రతులకు: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka, Ongole - 523 002, 08592 – 233271

www.saibharadwaja.org www.saimasterforums.org

# సత్సంగము

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీ సాయిబాబాను పూజించుకొనే పద్ధతిలో సత్సంగము ముఖ్యమైన అంశము. సత్సంగమంటే సాయి భక్తులందరూ దినమున కొక్కసారిగాని, అది వీలుగానపుడు వారానికొకసారిగాని, శ్రీ సాయిబాబా మందిరంలోగాని, మందిరం లేనిచోట్ల యితర దేవాలయంలో గాని లేక వసతిగల ఒక భక్తుని యింటివద్దగాని సమావేశమౌతారు. సాధ్యమైనంతవరకూ పడమర దిక్కుగా ఒక పెద్ద సాయి పటాన్ని అందరికీ కన్పించేలాగున అమర్చి, తులసి మాలగాని, లేక ఒక పూలమాలగాని వేసి ధూపదీపాలు సమర్పించి అందరూ పటం కన్పించేలాగున దాని యెదుట కూర్చుంటారు. తన చిత్రానికీ తనకూ భేదమే లేదని సాయి భక్తులకనుభవపూర్వకంగా నిరూపించిన లీలలను స్మరించి, వారి ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని ప్రసాదించమని మనసార వారిని ప్రార్థిస్తూ "శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!" అని ముమ్మారు ఏక కంఠంతో 'జై' చెబుతారు. ముమ్మారు చెప్పడానికి కారణం కూర్చున్నవారిలో అన్యమనస్కులైనవారు సావధానులు కావడానికి మొదటి పిలుపు ఉపకరిస్తే రెండు, మూడు పిలుపులు వారిని ధ్యాస్తులను చేయగలవు. 'జయ' అనగా ఆ సందర్భంలో 'నమస్కారమని' అర్థమని గుర్తుంచుకోవాలి.

తర్వాత ఒక్క నిమిషము ఏకాగ్రంగా సాయిపై దృష్టినిలిపి సర్వులూ సాయి ప్రత్యక్ష సన్నిధిని భావన చేయాలి. తర్వాత బృందంలో ఒకరు 'ఓమ్ సమర్థ సద్గురు సాయినాథాయనమః' అని యెలుగెత్తి పల్కి, శ్రీ సాయిబాబా చరిత్రలో ఒకటి రెండు అధ్యాయాలు నెమ్మదిగా భావయుక్తంగా శ్రోతలందరకూ అందులోని సన్నివేశాలు మనస్సుకు హత్తుకొనేలాగా పెద్దగా చదివి శ్రవణం చేయించాలి. దీనివలన అనేక ప్రయోజనాలున్నాయి. సామాన్యంగా నేటి సామాజిక పరిస్థితులననుసరించి సాయంత్రం గం॥ 6.00 తర్వాత సత్సంగం జరపడం యెక్కువ మందికి వసతి. వృత్తి, గృహ ధర్మాలను నిర్వర్తించుకొని నిశ్చింతగా ఉండే విరామసమయమదే. రోజంతా లౌకిక క్రియలలో గడిపినందువలన మనస్సులో తత్సంబంధమైన భావాలెన్నో పేరుకుంటాయి. చరిత్ర శ్రవణంలో అవన్ని తుడిచి పెట్టుకుపోయి సాయి లీలలను వినడంలో మనస్సు శుద్ధమూ, ఏకాగ్రమూ అయిన స్థితికి వస్తుంది. సౌలభ్యమేగాక పై సూచించిన సమయం సాయం సంధ్య గూడాను. మూడు సంధ్యలలోనూ స్వల్ప యత్నంతో మనస్సు తేలికగా ధ్యానోన్ముఖమౌతుందని అనాదిగా సర్వమత సాంప్రదాయాలు గుర్తించి, రోజంతా దైవచింతన చేయలేకపోయినా సంధ్యా సమయంలోనైనా వ్యర్థప్రలాపాలలో సమయాన్ని వృధాచేయక దైవ స్మరణ చేస్తే యెంతో ఫలితముండగలదని బోధించాయి.

December సంచిక తరువాయి

# వార్తాలాపము

(సీరియల్)

## ప్రచారములో ఉన్న మతములు

శాస్త్రి :- అధికారులను దృష్టిలోనుంచికొని ఆలోచించిన అన్ని మతములును నిజమైనవే.

జగమునందలి మానవులందరికిని నిశ్రేయసము సిద్ధించుట కొరకు అకారణహితేచ్ఛువగు వ్యాసమహర్షి ఇట్లు వక్కాణించెను.

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"

ఇట్లు ప్రతిజ్ఞ చేసి వ్యాసభగవానుడు బ్రహ్మనిరూపణముకొరకు అనగా ఆత్మ నిరూపణము కొరకు సూత్రములను రచించెను. ఆ సూత్రసముదాయము వేదాంతదర్శన మనబడును. ఆసూత్రములు చాలాసంక్షిప్తముగను, గూఢార్థముకలవిగను ఉన్నవి. ఆసూత్రములయందు చతుర్వేదప్రతిపాద్య బ్రహ్మము అనునది సాధించబడినది. ద్వైత, విశిష్టాద్వైత, శుద్ధాద్వైత, కేవలాద్వైతములను నాల్గింటిని ప్రతిపాదించిన ఆచార్యులు పైసూత్రములను ఆధారముగా చేసికొనియే తమ తమ సిద్ధాంతములను ప్రతిపాదించిరి. ద్వైతసంప్రదాయప్రవర్తకులగు ఆచార్యులు మధ్వశ్రీ ఆనందతీర్థులు. వారు జీవ, బ్రహ్మముల వాస్తవికభేదమును అంగీకరించిరి.

విశిష్టాద్వైతప్రవర్తకులు శ్రీరామానుజాచార్యులు. వారు జీవ, ఈశ్వరులకు శరీర, శరీరిసంబంధము కలదని-అనగా అవినాభావ సంబంధము కలదని విశదీకరించిరి. "శరీరమునకు జీవుడు ఉన్నట్లుగనే పరమాత్ముడు ఉన్నాడు" అని "తత్త్వమసి" పదమునకు వారు అర్థము చెప్పిరి. ఈకారణముచేతనే అద్వైతపదము విశిష్టాద్వైత శబ్దమునందున్నను వారు అద్వైతవాదులుకారు.

శుద్ధాద్వైతప్రవర్తకులు వల్లభాచార్యులు, ఆయన సజీవుని అణుపరమాణురూపమున అంగీకరించి పరమాత్ముని అంశముగా స్వీకరించిరి. కాని వాస్తవిక ఐక్యము ఉండుటకతమున అంశాంశీభావమునకు తావు లేదు. కావున ఈమతము నిజమునకు ద్వైతమునందు లీనమగుచున్నది.

అద్వైతసంప్రదాయము శ్రుతిశుద్ధాంతము. దీని ప్రవర్తకులు శ్రీశంకరాచార్యులవారు. తమ భాష్య త్రయమునందు జీవబ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించిరి.పైన చెప్పిన నాలుగు అభిప్రాయములునుకాక నీలకంఠభాష్యాది వివిధసిద్ధాంత ప్రతిపాదకములగు అనేక భాష్యములు ఈసూత్రములపై వ్రాయబడినవి. అవి దేశపరిస్థితులయందలి పరివర్తనములతో బాటు వేర్వేరు అధికారులకొరకు, వేర్వేరు దేశములయందు వేర్వేరు కాలములయందు ఉపయోగించబడినవి. అయినను వేదాంతముయొక్క అంతిమధ్యేయము ఒక్కటే అనునది నిశ్చితాభిప్రాయము.

www.saibharadwaja.org www.saimasterforums.org

పరస్పరవిరుద్ధములగు అనేక మతములను బాదరాయణుడు తన 550 సూత్రములద్వారానే ఎట్లు ప్రతిపాదించును? అయితే బ్రహ్మ సూత్రప్రతిపాద్యమేమి? వేదాంతమునందలి (ఉపనిషత్తుల యొక్కయు మంత్రములయొక్కయు) అర్థమును నిర్ణయించుటయే తెలియనగు వేదాంత ప్రతిపాద్యము ఏమి అనునదియే బ్రహ్మసూత్రములు నిశ్చయించవలెను కదా! అందుచే "తత్త్వమసి" ప్రకరణమును కొంత విచారించెదము.

## పాండిత్య దురభిమానము

సామవేదీయ ఛాందోగ్యోపనిషత్తునందలి ఆరవ అధ్యాయములో ఒక కథ ఉన్నది. ఉద్దాలకుడు (లేక ఆరుణి) అను పేరుగల ఒక ఋషికి శ్వేతకేతుడను చపలుడగు కుమారుడు ఉండెను. కుమారుని తండ్రి గురుగృహమునకు అధ్యయనమునకై పంపెను. ఆ రోజులలో 8 సంవత్సరముల బాలుడే గురుకులమునకు వెళ్లెడివాడు. కాని శ్వేత కేతుడు 12 సంవత్సరములవరకు గురుగృహమునకు వెళ్లుటకు సిద్ధమవలేదు. అతని చపలత్వము స్వేచ్ఛాజీవితముగా మారుచుండెను. ఇది చూచి 12వ సంవత్సరమున పంపవలసి వచ్చెను. అతడు 12 సంవత్సరములు గురుగృహమున అధ్యయనముచేసి మరలివచ్చెను. ఆ కారణముచే అతనికి "నేను విద్వాంసుడను" అను గర్వము కలిగెను. నాతండ్రిగారి యందును ఇతరులయందును, నాకున్నంత విద్య లేదు. వారికి నేను ఏల నమస్కరించవలెను? ఈ ఉద్దేశ్యముతో వచ్చినంతనే వినయవివేకములు లేక ఏవిధమయిన మర్యాదలను పాటించ లేదు. తండ్రికి వందనమైన చేయలేదు. ఆ కారణముచే తండ్రికి ఖేదము కలిగి ఆ కుమారునికి గల గర్వము పోగొట్టి సదాచారములను నేర్పు ఉద్దేశముతో ప్రశ్నించెను.

తంహ పితోవాచ శ్వేతకేతో యన్ను సౌమ్యేదం మహామనా అనూచానమానీ స్తబ్ధో2స్యుత తమాదేశ ప్రాజ్యోయేనాశ్రుతంశ్రుతంభవతీత్యాది. "ఓ శ్వేతకేతూ! ఓ సౌమ్యుడా! నీవు విద్యాగర్వముచే వినయ హీనుడవయితివి. ఏ విషయమును తెలిసికొనుటచే ఈ లోకమున శ్రవణ విషయముకాని పదార్థముకూడ శ్రవణము చేయబడినదిగా ఏర్పడునో అట్టి విషయమును గురువుగారిని ప్రశ్నించివారి యుపదేశముద్వారా గ్రహించితివా?" అని తండ్రి ఉద్దాలకుడు అడిగెను.

అంతట శ్వేత కేతువు ప్రశ్నించెను.

"కథం ను భగవః స ఆదేశో భవితి" ఇతి ।

"పూజ్యుడవగు ఓతండ్రీ! అట్టి పదార్థము ఏమైనా కలదా? ఏ ఒకపదార్థమును తెలిసికొనినంత మాత్రమున సర్వపదార్థములును తెలిసికొనుటకు వీలగునో అట్టి వస్తువేమైన కలదా?".

- సశేషం

# సంబరాలు తెచ్చింది సంక్రాంతి

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

జాతిలో సమైక్యతను సృష్టించేవి పండుగలు. అవి మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. ఇతర కారణాలు ఎలావున్నా కష్టాలు మరచి, బంధు మిత్రులతో కలసి, దేవతారాధనలో పాల్గొని, ఉన్నంతలో శారీరిక అలంకరణ చేసుకొని, పదిమందితో కలిసి భుజించి, లేని వారికి ఇంత పెట్టటము పండుగలలో ముఖ్య ఉద్దేశ్యము.

సంక్రాంతి మార్గశిర పుష్యమాసములలో ఉత్తరాయణ పుణ్యకాలములో వస్తుంది. మన పూర్వులు సూర్య సంచారాన్ని 2 భాగములుగా చేసినారు. సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తరదిశయందు ఉన్న, ఉత్తరాయణమని అన్నారు. ఖగోళశాస్త్ర దృష్ట్యా భూమి తమ అక్షంపై తానుతిరుగుచూ సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుంది. అలా సూర్యుడు ఆకాశంలో ప్రయాణించే మార్గమును క్రాంతివృత్తం అంటారు. ఈ మార్గంలోనే నక్షత్రసముదాయమైన రాశిచక్రముంది. దీనినే జోడియాక్ అంటారు. దీనిని 12 రాశి చక్రాలుగా మన పూర్వులు విభజించారు. (మేషాదిరాశు లు మొదలగునవి). ఒకరాశి నుండి మరొకరాశికి జరుగు సూర్యచలనమునే సంక్రమణము అంటారు-కర్కాటకమునుండి ధనుస్సువరకు గల రాశులలో సూర్యుడు సంచరించే సమయాన్ని దక్షిణాయణమని, మకరము నుంచి మిధునందాకా ఉత్తరాయణమని పూర్వులు ఏర్పరచారు. దక్షిణాయనంలో విపరీతంగా వర్షాలుకురిసి నదులుపొంగి గ్రామాలు, పంటలు నాశనమవటముకాక ప్రాణనష్టంకూడా జరుగుతుంది. అంతేగాక కలరా, శీతలవ్యాధులు బాగా వ్యాపిస్తాయి. ఉత్తరాయణం వచ్చేసరికి వానలుతగ్గి, ఎండగాచి జనజీవనము ప్రశాంతముగా వుంటుంది. ఈ సమయములోనే వివిధములైన పుష్పజాతులు ఎక్కువగా పుష్పిస్తాయి.

ఈ సమయములోనే రైతులు పండిన పంటలను ఇంటికి తెచ్చుకొని గాదెలలో నింపుకుంటారు. స్త్రీలు, ఆవుపేడతో గొబ్బిళ్ళు ఇంటిముంగిట అలంకరిస్తారు. ఇటీవల 'ఆవుపేడ' వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మధుర ప్రేమకు, భక్తికి సంకేతముగా గోదాదేవి ఈ మాసంలో వ్రతమాచరించి శ్రీరంగనాధుని పతిగా పొందినకాలము, ఈ మకర సంక్రమణ మాసము. దీనినే ధనుర్మాసముగా ఆలయాలలో జరుపుతారు. ఎక్కడచూచినా మంగళవాయిద్యాల ఘోష విన్పిస్తుంది. హరిదాసుల హరిస్మరణ వీనులవిందు చేస్తుంది. కలిమిని అందరితోకలిసి పంచుకొనడము ఈ పండుగలోని ప్రత్యేకత. ఒక విధముగా ఈ పండుగ ఒక ఆధ్యాత్మిక సూత్రాన్ని కూడా మనకు అందిస్తుంది. సూర్యుడు నిష్కాముడు సాటిజీవులనుండి ఏమీకోరక వెలుగును, వేడిని ప్రసాదిస్తాడు, తన ధర్మాన్ని తూచ తప్పక ఆచరిస్తాడు. జీవులు కూడా తమ ధర్మాన్ని తూచ తప్పకుండా ఆచరించి, చేసే ప్రతిపనిని నిష్కామంగా చెయ్యడము అలవర్చుకోవాలి. దీనినే శ్రీ సాయి "విత్తులు మొలిచినందుకు సంతోషించవు, మాడితే దు:ఖించవు" అని చెప్పారు. ఈ పవిత్రదినములలో స్వర్గ ఉత్తరద్వారము తెరచివుండునని శాస్త్రము. అందుకనే భారత యుద్ధంలో అంపశయ్యగతుడైన భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలమువచ్చిన తర్వాతనే దేహత్యాగం చేస్తాడు. జన సందోహంలో ఒక క్రాంతి, ఒక వెలుగు, కోలాటాలు, గొబ్బిళ్ళు, బొమ్మలకొలువులు పదిమంది ఒకచోట చేరి ఆనందించే వేడుక సంక్రాంతి. సహాయము చేసిన వారికి కృతజ్ఞతలు చెప్పడము జీవధర్మము. ఈ పండుగకాలములో పశువులకు విశ్రాంతి వుంటుంది. పశువులను(ఎడ్లు, దున్నలు) అలంకరించి వాటిని పూజించటమూకూడా ఈ పండుగలోని ఒక విశిష్టత. కలసిమెలసి జీవించటము, ఆనందముగా వుండగలగడము, ఉన్నంతలో ఇతరులకు సాయపడటము, కృతజ్ఞతాభావము కలిగివుండటము, సద్గురువును, దైవాన్ని సేవించడము, ఈ సంక్రాంతిలో అంతర్లీనముగావున్న ధర్మోద్దేశము.

# ధర్మం నాడు–నేడు

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రాచీనకాలంలో పిల్లలు గురువులవద్ద గురుకులాలలో వుంటూ ధర్మ శాస్త్రాధ్యయనంతోపాటు ధర్మాచరణలో సుశిక్షితులయ్యేవారు. 6నుండి 16సం॥లు లోపల ధర్మాచరణ అలవడకుంటే అటు తర్వాత వారికలవడటం ఎంతో కష్టం. ఆచరణ శూన్యమైన వాచాలత్వమే మిగులుతుంది. గురుకులాలలో బిడ్డలు తాము ధర్మాన్ని అవగాహనతో ఆచరించడమేగాక, సాటి విద్యార్థులను ఆచరించేలా ప్రోత్సహించేవారు. వారికట్టి బోధ హృద్యంగా వుండటానికి నైతిక బోధను నాటక, నృత్య, గేయాల రూపాలలో అందజేసేవారు. వాల్మీకి మహర్షి లవకుశలచేత రామ కథను నాటకంగా ప్రదర్శింపజేయడం, శ్రావ్యకావ్యంగా అందించడం యిందుకుదాహరణ గురుకులంలోని ప్రహ్లాదుడు సాటి పిల్లలను కూడదీసి హరికథలు వారికి నేర్పేవాడు.ఇంకొక ఉదాహరణ:

చైనాలో 1978లో పిల్లలకోసం రూపొందించబడిన ఆచరణసూత్రాలను పాటలరూపంలో అందజేయడం ఆరంభించారని "బీజింగ్ రివ్యూ" (No. 48, December 7, 1981)న ప్రకటించింది. ఈ పత్రికలోని వ్యాసం ఇంకా ఇలా వ్రాసింది:

ఆదర్శ ప్రాయులైన వారినుండి, గొప్ప నాయకులనుండి పిల్లలు ఎంతో నేర్చుకుంటారు. ప్రజా విమోచనకు చెందిన లేఫెంగ్ అనే వ్యక్తి సాటివారికి నిస్వార్థ సేవ చేయటంలో విద్యార్థులకు ఆదర్శమయ్యాడు. అతనివలె ధర్మ సూత్రాన్ని అర్థం చేసుకొని కష్టపడి చదివి, చక్కని శారీరకమైన ఆరోగ్యం కలిగివుండి తమలోని బలహీనతలను జయించి నిత్య జీవితంలో మంచి పనులను చేయడం నేర్చుకొన్నారు చాలామంది పిల్లలు.

ఈ విద్యా విధానం విద్యార్థులలో బాగా నాటుకొంటూవుంది. 1978 నుండి 1981 లోపల సుమారు లక్షమంది విద్యార్థులు లే-ఫెంగ్ జీవితంనుండి ఎన్నో నేర్చుకున్నారు. ఇది ఒక ఉద్యమంగా రూపొందింది. షాంఘై నగరంలో సభ్యత, సంస్కారము, ఆరోగ్యము, క్రమ శిక్షణ మరియు నీతి అనే ముఖ్యఅంశాలకుతోడు చక్కని సిద్ధాంత భోదలను, నీతి, నిజాయితీలను, పార్టీ ధర్మాన్ని, సామాజిక వ్యవస్థని  నిలబెట్టడం అనే అంశాలతో కూడిన మానసిక సౌందర్యము, సభ్యతగా మాట్లాడటం; కష్టపడి పనిచేస్తూ సాటివారి శ్రేయస్సును పట్టించుకోవడం; ఇంటా బయటా పరిశుద్ధమైన వాతావరణాన్ని ఏర్పరుచుకొనడము అనే నాల్గురకాల సౌందర్యాన్ని నేర్పడమొక  ఉద్యమంగా సాగుతున్నది. వాంఛనీయమైన భావాలతో నిండిన అందమైన గేయాలను ప్రత్యేకంగా వ్రాయించి విద్యార్థులకు నేర్పడం ద్వారా యువకులలో అవాంఛనీయమైన భావాలతో నిండిన విదేశీయ సంగీతం పట్ల మోజును తొలగించారు.

# శ్రీ భరద్వాజ లేఖామృతము

29/8/86

చి|| సౌ|| కమలకు

శ్రీ సాయినాథుని శరణాగతులు

[illegible]

[illegible] 10 [illegible]

[illegible] 25) - [illegible] 10 [illegible]

[illegible]

ఆశీస్సులతో
భరద్వాజ

# శ్రీ భరద్వాజ లేఖామృతము

**Date: 28/8/86**

చి॥ సౌ॥ కమలకు

బాబా శ్రీ సాయీశుని శుభాశీస్సులు. జాబులోని సాయికృపాలీలలు చూచి చాలా సంతోషమైంది. మీవారు క్షేమమని తలుస్తాను. ఇక్కడ అమ్మగారు, పిల్లలూ క్షేమం.

అచట సాయిమందిరంలో సత్సంగం స్థిరంగా మన 'సత్సంగము-భజన' అను bookletలో వ్రాసిన పద్ధతిలో వారానికొకసారైనా జరిగేలాగ, ప్రతిరోజూ-ప్రత్యేకంగా గురువారం సాయంత్రం జనమెక్కువగా వచ్చేప్పుడు గూడ-మందిరంలో 1/2 గం॥ సేపు సాయి చరిత్ర శ్రవణం చేయించేలా యత్నించగోర్తాను. అది కొన్ని ఆవర్తాలయ్యాక శ్రీగురుచరిత్ర శ్రవణం చేయిస్తే బాగుంటుంది. మందిరంలో 4 వేళలా శిరిడీ ఆరతులు పాడించే అలవాటు, అది వీలుగాకుంటే కనీసం రెండువేళలయినా చేయించేలా ప్రయత్నించండి. ఆపై సాయి దయ. జీవిత సభ్యులకు వాయిదాలపద్ధతి (నెలకు 25/- చొప్పున 10 మాసాలలో) ఏర్పాటు చేశారని మీ సాటి భక్తులకు తెలియదేమో-వారాభాగం పత్రికలో చదవడంలేదేమో.

నేను హైద్రాబాద్ వచ్చేప్పుడు తెల్పుతాను.

ఆశీస్సులతో,
భరద్వాజ

ANNADANAM LIST :-

| | | |
|---|---|---|
| 1. New Era High School | Hyderabad | Rs.1343.00 |
| 2. N.Jagannath Rao | Roorkela | Rs.1343.00 |
| 3. M.Vijay Kumar | Hyderabad | Rs.1343.00 |
| 4. G..Shobharani & Friends | Secunderabad | Rs.1500.00 |
| 5. T.RamaChandra Reddy | Hyderabad | Rs.5000.00 |
| 6. Praveen Kumar | Hyderabad | Rs.1350.00 |
| 7. Vijay Lakshmi | Hyderabad | Rs.1343.00 |
| 8. Late Subbamma & Kotilingam | Prakasam | Rs.1350.00 |
| 9. Y.Diwakar Reddy | Guntur | Rs.1343.00 |
| 10.Rajeswari SivaKumar | U.S.A | Rs.4193.94 |
| 11.Sumathi | U.S.A | U.S $ 108 |
| 12.T.Rajasekhar Reddy | Hyderabad | Rs.1343.00 |
| 13.Satish & Sanath Chandra | Krishna Dt. | Rs.2000.00 |
| 14.Late K.Subba Rao | Secunderabad | Rs.1350.00 |

SCHOOL LIST :-

| | | |
|---|---|---|
| 1. R.V.Murthy | Secunderabad | Rs.516.00 |
| 2. Sri G. Brahmaiah | Chirala | Rs.500.00 |

www.saibharadwaja.org www.saimasterforums.org

రిపబ్లిక్‌డే సందర్భంగా ప్రత్యేక వ్యాసం

# శుభాకాంక్షలు

ఆచార్య భరద్వాజ

సాయి బంధువులందరికీ నూత్న సంవత్సర శుభాకాంక్షలు.

ఈ అనంతమైన ప్రకృతిలో ప్రతి వస్తువూ ఏదో ఒక రీతిన మారితీరుతుంది. ఈ మార్పు పండుపండటంవంటిదన్నాకావచ్చు లేకుంటే కుళ్ళిపోవడం వంటిదన్నా కావచ్చు. జీవితంలో వచ్చే పరిణామాలన్నీ పండుపండటంలాంటిదిగా చూచుకొనడమే ఆధ్యాత్మికత. మనలో ఇటువంటి మార్పు కావాలంటే రానున్న సంవత్సరంలో యేమేమి చెయాలో ఆలోచించుకొని ధృడంగా నిశ్చయించుకోవాలి.

సాధనంతటికీ విలువైన సూత్రమొకటున్నది అన్నీ తనకు ప్రసాదించిన ఆ భగవంతునికి, ప్రతిదీ సమర్పించి మిగిలినది ఆయన ప్రసాదంగా స్వీకరించడమే. భగవంతుడు మనకిచ్చిన కాలంలో ప్రతిరోజూ మొదట కొద్ది సమయం భగవంతుడికి అర్పిస్తాము. అంటే నిద్రలేస్తూనే సుప్రభాతం వింటాము. తర్వాత ఆయన నామం స్మరిస్తాము. ధ్యానము, పూజ చేసుకుంటాము. అలానే సంవత్సరంలో మొదటిభాగంలో నియమబద్ధమైన చరిత్ర పారాయణకు ఉపయోగించటం ఎంతో మంచిది, స్నానము, భోజనము లాగా పారాయణ నిత్య జీవితంలో ఒక భాగమయ్యేలా చూచుకోవాలి. ఇక్కడ సాయి చెప్పి సూక్తులలో ఒకటి మనకు బాగా ఉపయోగపడుతుంది.

"ఎవరైనా నన్నే ధ్యానించి, నా నామమే స్మరించి నా లీలలు గానంచేస్తే, వారే నేనుగా మారిపోతారు; వారి కర్మ నశిస్తుంది, నేనెప్పుడూ వారిచెంతనే వుంటాను. కాని అలా చేయగల్గాలంటే ఆయన చరిత్ర, "శ్రీ గురు చరిత్ర" కూలంకషంగా ఎన్నో సార్లు చదవాలి. కొందరికి చరిత్ర ఇదివరకే ఎన్నోసార్లు పారాయణ చేసాంకదా, ఇంకా ఎన్ని సార్లు చేస్తాములే అందులో ఏమున్నది?" అన్పించవచ్చు. అప్పుడు పారాయణ చేయనట్లే లెక్క, మనలో ఎక్కువమందిమి కష్టాలు, కోరికలు తీరాలన్న లక్ష్యంతో పారాయణ చేస్తాం. తరువాత సాయి యెంతటివారో తెలిశాక యింకా తెలుసుకోవడానికి పారాయణ చేస్తాము. అప్పుడు మొదటిసారిగా మనలో భక్తి మొలకెత్తుతుంది. అటు తర్వాత వారి వారి మనః పరిపాకాన్ని అనుసరించి పారాయణపట్ల ఒక్కొక్క భావం ఏర్పడుతుంది. కేవలం రుచులను, మార్పులను కోరే మనస్తత్వంగలవారికి వారి చరిత్ర పారాయణ చేయడం మొఖంమొత్తినట్లుంటుంది. రుచులు, మార్పులు కోరేది మనలోని రజోగుణమే. రజో, తమో గుణాలు మనలో మేల్కొన్న భక్తి అనే అంకురాన్ని నశింపచేస్తాయి. కారణం భక్తీ, శ్రద్ధలన్నవి సత్వగుణ లక్షణాలు. ఈ సత్వగుణం గలవారికి పారాయణ చేస్తున్నకొద్దీ శ్రీసాయినాధుని సన్నిధి అనుభవమవుతుంది. ఆ సన్నిధి అన్నింటికంటే మధురమైనది. అందుకని పారాయణ యింకా యింకా మధురమవుతుంది. ఇటువంటి వికాసాన్ని యింకా బలంగా కల్గించుకోవటానికి సాధనంగానే "సాయిసన్నిధి" అనే గ్రంథం వ్రాసి ముద్రించడం జరిగింది. అది పారాయణ చేస్తే అటు మార్పుగానూ వున్నట్లు వుంటుంది, అది సాయిపరంగానూ వుంటుంది. అది కొన్ని సార్లు చదివాక బాబా చరిత్ర ఎంతోకొత్తగానూ, ఎక్కువ ప్రీతిగాను వుంటుంది. సాయిచరిత్ర పారాయణ తర్వాత మరలా "సాయిసన్నిధి" పారాయణచేస్తే దానికి కూడా సరికొత్త రుచి వస్తుంది. ఈరీతిన మనస్సుకు ఆ సాటిలేని సద్గురువుయొక్క సన్నిధి ఎప్పుడూ అనుభవింప చేయడమే ఈ మూడవ దశలోని వారికి పారాయణయొక్క ప్రయోజనం. అటు తర్వాత మన నిత్య జీవితాన్ని సాయి చెప్పిన రీతిన

ఉత్తమంగా పరివర్తన చెందించుకోవడం ఎలాగా అన్న చింత కలుగుతుంటుంది. అటువంటి పరివర్తన కలగటానికి మనం చూచేదంతా కలిపి నిజానికి ఆ సాయినాథుని రూపమేనన్న విషయం గుర్తుండడమే ఎంతో ముఖ్యం. ఈ సత్యం మరవడమువల్లనే మనకన్ని మనోవికారాలు కలిగేది. జన్మ, జన్మల అభ్యాసబలంవలన యీ భావం, మాటిమాటికి తొలగిపోతూ వుంటుంది. అప్పుడు మనం దానిని మరలా మరలా గుర్తుచేసుకోవవడమే పారాయణ యొక్క పరమ ప్రయోజనం. ముఖం జిడ్డుకారినపుడల్లా తుడుచుకుంటూనే వుంటాము. గుడ్డలు మాసినప్పుడల్లా మరలా మంచివి వేసుకుంటూనే వుంటాము. ఎన్ని సంవత్సరాలుగా అన్నం తింటున్నా, ఈ రోజు ఆకలికాగనే మరలా భోజనం చేస్తూనేవున్నాము. అలానే మనలో యీ భావం తొలగినప్పుడల్లా మరలా పారాయణద్వారా దానిని నెలకొల్పుకుంటూనే వుండాలి.

అందుకే శ్రీ వాసుదేవానందస్వాములవంటివారు బాల్యం నుండి వృద్ధాప్యంవరకూ "గురుచరిత్ర" వంటి గ్రంథాన్ని నిత్యమూ పారాయణ చేస్తూనే వున్నారు. అందుకే వాళ్లు అంతటివాళ్ళు కాగలిగారు. అంటే తెలుసుకున్న సత్యాన్ని పూర్తిగా ఆచరణలో పెట్టి, అవి నిత్యజీవితంలో సహజమయ్యేలాగ చూచుకొనేవారు మాత్రమే సత్ఫలితాన్ని పొందుతారు. అలాగాక, కొద్దిసార్లు చదివి అందులోని కథ మనస్సుకుమాత్రం తెలియడంతో తృప్తిచెందే వారికి అహంకారము మాత్రమే కలుగుతుంది. తమకన్నీ తెలుసునని భ్రమించి సాటివారినందరినీ తక్కువగా అంచనావేసి, పనికిమాలిన విమర్శలు చేసుకుంటూ సంతృప్తి పడుతుంటారు.

పైన చెప్పిన రీతిన మళ్ళీ మళ్ళీ చరిత్ర పారాయణ చేయడంవలన పైచెప్పిన భావాన్ని నిల్పుకోవడానికి ప్రయత్నిస్తున్నా, ఆ భావం చెదురుతూ వుండటం చూచి నిరుత్సాహపడగూడదు. అటువంటప్పుడు ఏమిచెయ్యాలో శ్రీసాయి చెప్పిన బోధలలోనే వున్నది. జీవితంలోని వివిధ సంఘటనలు, విషయాలపట్ల అనాలోచింతంగా మనకుండే భావాలే రజస్తమోగుణాలయొక్క రూపం. చక్కగా సాయి చెప్పి రీతిన ఆలోచించగల్గడమే సత్వగుణం యొక్క రూపం. కనుక కొన్నాళ్ళకు యీ పారాయణ యాంత్రికమవడానికి, మన భావాలు మారకపోవడానికి ఆయన బోధలను చదివి అర్ధం చేసుకొనకపోవడమే కారణం. సాయి పట్ల, పారాయణపట్లా మనలో శ్రద్ధ పెరగాలంటే రోజూ కొన్ని పేజీలు "శ్రీ సాయి ప్రభోదామృతము" చదివి దానిని బాగా మననం చెయ్యాలి. సాయిచరిత్ర పథ్యం అనుకుంటే, కఠినమన్పించినా, తర్వాత పొడుగునా ఆరోగ్యం ప్రసాదించే దివ్య ఔషధంలాంటిది వారిబోధ. అజ్ఞానమనే దీర్ఘరోగం తగ్గడానికి రెండూ అవసరమే. సాయి గూడా "నేను చెప్పినది ఆచరించనివారితో నాకేమిపని?" అన్నారుగదా.

ఈ నూత్న సంవత్సరానికి మరొక్కమాట – ప్రపంచంలో సాయి ధర్మమూ, సాయి భక్తి వృద్ధిచెంది ధర్మం నెలకొల్పాలన్న నిస్వార్ధమైన సంకల్పంతో, మన స్వాతంత్రదినమైన ఆగష్టు 15, రిపబ్లిక్‌డే అయిన జనవరి 26వ తేదీలకు పూర్తయ్యేలాగా ప్రతిఒక్కరమూ నిష్కామంగా 2 లేక 3 అవర్తాలయినా ప్రతిసంవత్సరము చరిత్ర పారాయణ చేస్తుండాలి. ఈ పద్ధతి అనాది సిద్ధమని "గురుచరిత్ర" చూస్తే తెలుస్తుంది. "లోకాస్సమస్తా సుఖినోభవంతు'' అని నిత్యపూజలోను, సంధ్యావందనంలోనూ సంకల్పించాలని మహర్షులు ఏనాడో ఆదేశించారు. యీ సరియైన పద్ధతి అలవరచుకుంటానికి నిశ్చయించుకొనడమే సాయి భక్తులమైన మన కర్తవ్యం. శ్రీసాయి అవతార లక్ష్యం అదేగా.

# శ్రీ దత్తలీలామృతము

December సంచిక తరువాయి

(శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)

– శ్రీమతి శ్రీదేవి

అలర్కా! ఒక్క విషయం ఆలోచించు, వివేకవంతుడైన నరుడు ముక్తిని కోరి యోగసాధనలో జీవిత ప్రయాణాన్ని సాగిస్తున్నపుడు యిక అతనికి వేరే కోరికలు ఏమివుంటాయి? సర్వశక్తులూ వొడ్డి లక్ష్యసాధనలో సంపూర్ణంగా నిమగ్నుడైన ఆ విరాగికి యిక ముక్తిపై తప్ప దేనిపైనా మమకార వికారాదులు వుండవు కదా? విషయలోలురకు వలె అతడికి జీవితావసరాలు కూడా ఏమీ వుండవు.

అతడు మఠంలో, గుహలో, అరణ్యంలో లేక చెట్టు నీడలో – ఎక్కడ వుంటే అదే తనయిల్లుగా భావిస్తాడు. ఆకలి వేసినపుడు లభించిన భోజనాన్నే షడ్రసోపేతమైన భోజనంగా భావించి ఆరగిస్తాడు. తన దగ్గర వున్న దండ కమండలాదులే అతని సంపద, ఇలా భావిస్తూ నిత్యతృప్తుడై జీవించే యోగికి వేటిపైనా మమకారమనేది వుండదు. గృహస్థుడు తన అవసరాలను పుత్రులు, మిత్రులు, సేవకులు మొదలైన తన సన్నిహితుల చేత ఎలా నెరవేర్చుకుంటాడో అదే విధంగా యోగి జన్మతః తనకు లభించిన మనస్సు, బుద్ధి, చిత్తము వంటి అంతరేంద్రియముల సహాయంతో ముక్తిని సాధిస్తాడు. సందేహం లేదు.

ఏమి రాజేంద్రా? నేను చెప్పిన విషయాలనన్నింటినీ బాగా అర్థము చేసుకొన్నావా? నీ భయము తొలగిపోయిందా? నీ మనస్సు కుదుట పడిందా? అంటూ ఆ అభయంకరుడు, కరుణాసాగరుడు శ్రీ దత్తస్వామి నవ్వుతూ అలర్కునిపై తన కృపాదృష్టిని ప్రసాదింపజేస్తూ ప్రశ్నించగా అలర్క మహారాజు సంతోషంతో స్వామికి నమస్కరించి వినమ్రతతో యిలా అన్నాడు – "ఓ తండ్రీ! దత్తస్వామీ! భక్తవత్సలా! పరమ దయాకరుడవైన నీవు నన్ననుగ్రహించిన నాకు యిక భయమా? నీ బోధామృతము వర్షించి నా వివేకాన్ని మేల్కొలిపిన తర్వాత యింక నా మనస్సులో భయాలకు బాధలకు తావెక్కడా? నా అజ్ఞానం తొలగిపోయింది. నా మనస్సు కుదుట పడింది.

ఓ స్వామి! ఎంత చిత్రం! నాకు కలిగిన సంకట పరిస్థితులే నీ నీడను చేరే సౌభాగ్యాన్ని కల్గించటం ఎంతటి అదృష్టం! నీ దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించటం, నీ బోధామృతంగ్రోలి పరమార్థం వైపు ఆకర్షింపబడటం అనే నా జీవితంలోని యీ చిత్రమైన మలుపులు నన్ను ఎంత కృతార్థుడను చేశాయి!

ఇంతకూ నాకు యీ భాగ్యం ప్రాప్తించటానికి కారకులు, నా కింత మేలు చేసిన పుణ్యాత్ములు కాశీరాజు, సుబాహువులే కదా? వారు చేసిన మేలు మరువగలనా? నన్ను నీ పాదారవిందాలకు చేర్చిన ఆ యిరువురి ఋణం ఏమి చేసి తీర్చగలను ?

కాశీరాజు, సుబాహువులు నాపై దండెత్తి రావటం, యుద్ధంలో నా ఓటమి, అటువంటి పరిస్థితిలో అపజయంతోను, ప్రాణభయంతోను నేను పడిన వేదన – చివరకు అమ్మయిచ్చిన ఉంగరం వలన నేను మీ సన్నిధికి పరుగిడి రావటం – యిలా ఒకదాని తర్వాత ఒకటి సంభవించిన ఘటనలన్నీ నేను ఎన్నో జన్మలుగా చేసుకొన్న పుణ్య ఫలాలుగా నాకు తోస్తున్నది. స్వామీ! అదృష్ట సమయంలో ఆపదలే సంపదలుగా మారుతాయనటంలో

www.saibharadwaja.org www.saimasterforums.org

సందేహమా? ఆ ఆపదలే కదా? నాకు మీ సన్నిధి భాగ్యాన్ని, తత్త్వజ్ఞాన సంపదను ప్రసాదించాయి! కృతార్థుడను స్వామీ! కృతార్థుడను! ఈ విధంగా నన్ను మీ దరి చేర్చిన కాశీరాజు, సుబాహువులకు నా హృదయపూర్వక పాదాభివందనములు.

స్వామీ! మీ అనుగ్రహంతో నా వివేకం మేల్కొన్నది. మరల మరల జన్మములెత్తుతూ, అనేక విధములయిన దుఃఖములనుభవిస్తూ అజ్ఞానాంధకారములో మునిగి పరితపిస్తూ యింత కాలము పడరానిపాట్లు పడ్డాను. ఇక మరల దుఃఖము రాని స్థితిని వివేకంతో సాధిస్తాను. సకల రాజ్యభోగాలను, గృహస్థ జీవితాన్నీ విడిచిపెట్టి మీరు చెప్పిన యోగసాధనలో జీవితాన్ని గడిపి ముక్తిని సాధిస్తాను. ఓ దేవదేవా! నాకు అనుజ్ఞయివ్వండి!" అంటూ పాదాలపై పడిన అలర్కుని లేవనెత్తి, స్వామి "చాలా సంతోషం! అహంకారమమకారాలను దరి చేరనీయక యికపై ముక్తికై పాటు పడటమే ఉత్తమమైన నిర్ణయం. వెళ్లు, నీకు శుభమగుగాక!" అని దీవించారు.

ఆ శుభ సమయంలో అలర్కుని ఆనందం అవధులు దాటింది. అతని హృదయంలో స్వామిపై భక్తి పెల్లుబికి ఏరులైపారింది. ఆ మహారాజుకు ఒక్కసారి తన గతం మదిలో మెదిలింది.

'అసలు తానెవరు ? తన గత జీవితమేమిటి ? యోగమాత మదాలస కుమారుడైన – రాజకుమారుడైన తాను ఎంతో కాలం రాజ్యభోగాలలో తగుల్కొని, పరమార్థాన్ని మరచి, ఆ ప్రాపంచిక భోగాలే సర్వస్వమై జీవిస్తున్న సమయంలో అనూహ్యంగా శ్రీ దత్తస్వామి అనుగ్రహం పొందటం ఎంత చిత్రం! తనను ఆ చీకటి జీవితం నుండి వెలికిలాగి దివ్యానందాన్ని ప్రసాదించిన ఆ స్వామి సన్నిధికి చేరిన తర్వాత తన జీవితపు రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. తానిప్పుడు పూర్వపు అలర్కుడనేనా అని తనకే సందేహం కలుగుతున్నది. అద్భుతమైన ఆత్మానుభవాన్ని చవిచూచిన తర్వాత యిక యీ లోకంలోని ఏ విషయమూ తనను ఆకర్షించటంలేదు సూర్యుని ముందు మిణుగురు మెఱుపుల వలే – ఈ ప్రపంచం, ప్రాపంచిక సంబంధ బాంధవ్యాలు, భోగభాగ్యాలు, సకల వైభవాలు ఆత్మానందం ముందు కళావిహీనాలై వెల వెల పోతున్నాయి. అంతటి అనుభూతిని ప్రసాదించిన శ్రీ దత్తస్వామి దయను ఏమని కొనియాడగలను? ఈ సకలాన్నీ సృష్టించిన ఆ సృష్టికర్తను అల్పుడనైన నేనేమని స్తుతించను? ఇలా యోచిస్తూ పట్టరాని ఆనందంతో కన్నులనీరు జాలువారుతుండగా చేతులు జోడించి స్వామిని యిలా స్తుతించాడు. –

శ్లో॥ నమస్తే సర్వదేవాయ – నమస్తే పురుషోత్తమ ।
నమో గిరాం విదూరాయ – చేతసే నిర్గుణత్మనే ॥
నారాయణ నమస్తేస్తు – పద్మనాభ నమోస్తుతే ।
సర్మస్మై సర్వబీజాయ –వాచ్య వాచక శక్తయే ॥
నమః ప్రణత పాలాయ – శరణాగత వత్సల ।
నమస్తే పూర్ణ బోధాయ – యోగీశాయ నమోనమః ॥
విశ్వంభర నమస్తేస్తు – నమోనాగారికేతన ।
అజ్ఞానాజగర గ్రస్తం – విశ్వముద్ధర గోపతే ॥

శ్లో॥ శ్రీపతే భూపతే దేవ – శాస్త్రయోనే నమోస్తుతే ।
నమో వేదాంత వేద్యాయ – మానాతిగ నమోస్తుతే ॥

www.saibharadwaja.org www.saimasterforums.org

అజ్ఞాన తిమిరాంధస్య - జనస్యా మూఢీ చేతసః ॥
జ్ఞాన చక్షుః ప్రదాయాస్తు - నమస్తే యోగభాస్కర ॥
బ్రహ్మ వంశ ప్రసూతాయ - మునయే వకానశాలినే ।
అనసూయా సుతాయాస్తు - నమస్తే మునిసూనవే ॥

యోగ ప్రవర్తనమునకవతరించి, భక్తుల యందనుగ్రహము కలిగి, శరీరానిత్యత్వమును యోగ ప్రభావమును వారికి బోధించిన విజ్ఞాన నిధీ! సురసిద్ధ సాధ్య సేవిత పాదాంబుజా! నీకు నమస్కారము.

సూక్ష్మమునకంటే సూక్ష్మము, స్థూలమున కంటె స్థూలమునగు దేవా! విశాల దేహము, సూక్ష్మ శక్తియు గల స్వామీ! దిగంబరుడవయ్యు, దివ్యాంబర ధరుడవయ్యు వెలుగు వేల్పా! నీకు నమస్కారము.

పరమేశా! మహానుభావా! యోగీశవంద్యా! బాలవయోవృద్ధ స్వరూపధారీ! కాంతా సమాలింగితాంగా! నీకు నమస్కారము. భవ భీతిచే మునులు విరాగులై మనః ప్రాణములను జయించి, మరొకండు భాసింపని సమాధి పూని సదసత్పరమైన ఏ పరమాత్మ యందు లీనమగుదురో అట్టి నీకు నమస్కారము. రూపరహితుడ వయ్యు బ్రాహ్మణ రూపు ధరించి, యోగి వయ్యు స్వేచ్ఛగా విహరించి ధర్మమూర్తి వయ్యు వర్ణాశ్రమముల వర్జించి వెలుగుదేవా! నీకు నమస్కారము. వేద బ్రాహ్మణ రక్షకా! కైటభాది దానవ మర్దనా! వైకుంఠా! మురారీ! కేశిసూదనా! కంస విధ్వసీ! కృష్ణా! నీకు పదివేల నమస్కారములు.

ఈ విధంగా స్తోత్రము గావించి, స్వామికి సాష్టాంగ నమస్కారము లొనరించాడు అలర్కమాహారాజు. "తండ్రీ! ఆ తర్వాత అతడు స్వామి నుండి శెలవు తీసుకొని నేరుగా కాశీరాజు సుభాహువుల వద్దకు వెళ్లాడు." అని సుమతి తన తండ్రికి చెప్పాడని వేద ధర్ముడు దీపకునికి తెలియజేశాడు. వేద ధర్ముడు దీపకునితో యింకా యిలా అన్నాడు. "దీపకా! సుమతి చెప్పిన అలర్కవృత్తంతమును విన్న తండ్రికి ఒక సందేహం పొడ చూపింది. అతడు కుమారుణ్ని యిలా ప్రశ్నించాడు. "కుమారా! కథ ఎంతో చిత్రంగా వున్నది. దత్తానుగ్రహమును పొందిన అలర్కమహారాజు దత్తస్వామి ఉండి సెలవు గైకొని తర్వాత తన కుటుంబమును గానీ హితోభిలాషులను గాని కలుసుకొనక యత్నింపక శతృభావముతో నుండిన కాశీరాజును సుబాహువును కలుసుకొనిన కారణమేమై వుంటుంది?" ఆ ప్రశ్న విన్న కుమారుడు నవ్వి, "తండ్రీ! శ్రీదత్తస్వామి అనుగ్రహం పొందిన అలర్కునిలో యీ ప్రపంచం పట్ల భేద భావం నశించింది. ఇక యిప్పుడు అతనికి మిత్రుడెవరు? శతృవెవరు? అతని దృష్టిలో యిద్దరూ సమానులే." అనిచెప్పి, తదుపరి కథను యిలా కొనసాగించాడు. "కాశీరాజు, సుబాహువులను కలిసి, అలర్కుడు వారిరువురికీ సాష్టాంగ నమస్కారాలాచరించాడు. కాశీరాజుకు చేతులు జోడించి నమస్కరిస్తూ యిలా అన్నాడు. "కాశీరాజా! నీకు నా హృదయపూర్వక నమస్కారాలు. నాకు రాజ్యకాంక్ష నశించింది. కనుక నీవు జయించిన నా రాజ్యమును శాశ్వతంగా నీవే ఏలుకో లేకుంటే అన్నగారికివ్వు. నీ యిష్ట ప్రకారము నిర్ణయం తీసుకోవచ్చు" అది విన్న కాశీరాజు "ఓ రాజా!! నీ మాటలు వితగా వున్నాయి. నీ రాజ్యమును నీవు తిరిగి పొందే ప్రయత్నం చేయకుండా శతృవవుతో యీ విధంగా మాట్లాడటం క్షత్రియ ధర్మంకాదని నీవెరుగవా? ధైర్యముతో తగు సైన్యాన్ని సమకూర్చుకొని యుద్ధము చేసి నీరాజ్యమును నీవు తిరిగి స్వాధీనపరచుకొనే

ప్రయత్నంచేయాలి. నీతి, న్యాయములతో రాజ్యపాలన చేస్తూ, యజ్ఞయాగాదికములు, దానధర్మాలు నిర్వర్తిస్తూ క్షత్రియ ధర్మాన్ని నిలబెట్టాలి. కానీ నీ ఆలోచన యిందుకు విరుద్ధంగా తోస్తున్నది. అన్నీ తెలిసినవాడవు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న కారణమేమిటి? అని ప్రశ్నించాడు. అలర్కుడిలా అన్నాడు. "కాశీరాజా! మొదట నేనుకూడా యీ విధంగానే భావించాను. కానీ, నీవు యుద్ధము చేసిన నా రాజ్యము నాక్రమించిన సమయంలో ఎన్నడూ ఓటమి నెరుగని నేను తీవ్ర మనోనుగ్రహించి, నాకు జ్ఞాన భిక్ష పెట్టారు. నా దుఃఖాన్ని సమూలంగా తొలగించారు. ఇప్పుడు నాకు సకల ప్రపంచము ఆత్మస్వరూపముగానే కన్పిస్తున్నది. ప్రాపంచిక బాంధవ్యాల నన్నింటినీ విడిచిపెట్టి, ఏకాంతంలో మనస్సును ఏకాగ్రపరచి, నిరంతర ధ్యాననిష్ఠలో నిలచి, ముక్తిని సాధించాలని నిర్ణయించుకొన్నాను. నా జీవితం యింత అద్భుతమైన మలుపు తిరగటానికి కారకుడవైన నీవు నాకు శతృవువు కానే కావు. నీకు నా ధన్యవాదాలు".

తమ్ముని మాటలు వింటున్న సుబాహువు మనస్సు ఆనందంతో ఉ పొంగిపోయింది. అతడు తన ఆసనం నుండీ దిగ్గున లేచి వచ్చి, తమ్ముడని గాఢంగా కౌగిలించుకొని, "తమ్ముడా, అలర్కా! ధన్యుడిని ఇంతకాలానికి సన్మార్గంలోనికి వచ్చావు. చాలా సంతోషం" అని పలికి, కాశీరాజుతో "మిత్రమా! నీకు నాధన్యవాదాలు, నేనువచ్చిన పని నెరవేరింది. నేను సంకల్పించిన కార్యం సఫలమైంది, ఇక నేను వెళ్లి వస్తాను శెలవు" అన్నాడు.

ఈ సన్నివేశాన్నంతా విస్తుపోయి చూస్తున్న కాశీరాజు సుబాహువుతో, "అయ్యా! మీ అన్నదమ్ముల మాటలు, చర్యలే వింతగా తోస్తున్నాయి. కొంతకాలం క్రిందట మీరు నావద్దకు వచ్చి మీరాజ్యమును మీ తమ్ముడు అపహరించాడనీ, తిరిగి మీ రాజ్యభాగాన్ని మీకిప్పించవలసిందనీ వేడుకొన్నారు. మీ కోర్కె మేరకు అలర్కునిపై దండెత్తి అతని రాజ్యమంతినే స్వాధీన పరచుకొన్నాను, ఆరాజ్యానికి మీరే పట్టాభిషిక్తులై పలుకొనండి. అలా చేయక, 'నేను వచ్చిన పని'. సఫలమైంది. వెళ్లిపోతాను.' అని అంటున్నారు. ఇదేమి చిత్రం? ఎక్కడకి వెళ్లిపోదలచారు?" అని ప్రశ్నించాడు.

సుబాహువు మహర్షి నవ్వుతూ యిలా బదులిచ్చాడు – "మిత్రమా! నన్ను క్షమించు. నేను వచ్చిన పని ఏమిటో అది ఎలా సఫలమైందో వివరంగా చెబుతాను, విను – మా తల్లి మదాలస శివుని వర ప్రసాదంగా జన్మించింది, ఆమె, జన్మతఃయోగినిగా యోగమాతగా జన్మించింది. ఆమెకు, నేను, విక్రాంతుడు, శతృమర్దనుడు, అలర్కుడు అను నలుగురు పుత్రలము జన్మించాము. మొదటి ముగ్గురికి మాతల్లి స్తన్యమునోటితోను, జ్ఞానబోధ చెవులతోను త్రావించుతూ పెంచింది. అందువలన మేము ముగ్గరము చిన్న వయస్సులోనే విరాగులమై ముక్తి సాధనకై యిల్లు విడచి అడవులకేగి తపస్సులో నిమగ్నులమైనాము. ఇక నాల్గవ కుమారుడైన అలర్కునికి మాతల్లి భర్త ఆజ్ఞ ప్రకారముక్రమముక్తి మార్గమును బోధించింది. అందువలన అలర్కుడు కర్మలంపటుడై, సంసార బంధములలో పడి కొట్టుకొనుచు, వైరాగ్యహీనుడై, ముక్తికాంక్షలేనివాడై జీవిస్తుండటం గమనించిన నేను ఎంతో ఆవేదన చెందాను. నలుగురు స్నేహితులము కలసి జీవిస్తున్నపుడు అందులో ఒకడికి ఏదైనా ఆపద సంభవించనపుడు మిగిలిన వారు చూస్తూ ఊరుకోగలరా? అదే విధంగా రక్త సంబంధం కలిగిన. మా స్వంత తమ్ముడు చెడిపోతుంటే అతనిని సన్మార్గములో పెట్టవలసిన బాధ్యత మా సోదరులదే

Continued on page 22

మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ సాయి సచ్చరిత్ర

**December** సంచిక తరువాయి

## అధ్యాయము - 48

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః, శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమః, శ్రీ సద్గురు సాయినాథాయ నమః

సపత్నేకర్ తన భార్య చేత నైవేద్యం తయారు చేయించి మశీదుకు తీసుకువెళ్ళాడు. పూజ, ఆరతి అయిన తర్వాత శ్రీమతి సపత్నేకర్ ఆ నైవేద్యాన్ని బాబా ముందు పెట్టింది. ఆ నివేదనను నీళ్ళతో సంప్రోక్షించి, ప్రాణాపాన వ్యానాదులతో బాబాకు సమర్పించారు(151,152). బాబా తమ హస్తాలతో నైవేద్యాన్ని స్పృశించి సపత్నేకర్‌కు యిచ్చారు. అతని ఆనందానికి అవధులు లేవు(153). అప్పుడు అక్కడ వున్న భక్తులు బాబా పాదాలకు నమస్కరిస్తున్నారు. ఆ గుంపులో త్రోసుకుంటూ సపత్నేకర్ గూడ మళ్ళీ బాబాకు నమస్కారం చేసుకుంటున్నాడు(154). అప్పుడు బాబా సపత్నేకర్‌తో, "ఎందుకిలా మాటిమాటికీ నమస్కరించుకోవడం ? భక్తి గౌరవాలతో హృదయపూర్వకంగా ఒక్కసారి నమస్కరిస్తే చాలు!" అన్నారు(155,156). ఆ రోజు జరిగే చావడి ఉత్సవంలో సపత్నేకర్ తన చేతిలో దండం ధరించి ఆనంద పరవశుడై పల్లకీ ముందుగా నడవసాగాడు.(157) ఆ చావడి ఊరేగింపు గూర్చి శ్రోతలకు ఇంతకుముందే వివరించాను. కనుక గ్రంథ విస్తారభీతితో మళ్ళీ యిక్కడ చెప్పడం లేదు(158). ఆ రోజు రాత్రి చావడిలో బాబా ఒక అద్భుతలీల చేసారు. సపత్నేకర్ బాబాను చూస్తూ కూర్చున్నాడు, అతనికి బాబా సాక్షాత్తూ పాండురంగనిలాగా దర్శనమిచ్చారు.(159)

తర్వాత అతడు తిరుగు ప్రయాణానికి అనుమతి కోరడానికి బాబా వద్దకు వెళ్ళాడు. బాబా అతనిని భోజనం చేసి వెళ్ళమని చెప్పారు. అతడు బాబా చెప్పినట్లే భోజనం చేసి బయలుదేరేముందు బాబా దర్శనానికి మళ్ళీ వెళ్ళాడు.(160). ఇంతలో అతని మనస్సులో ఒక ఆలోచన వచ్చింది,' ఇప్పుడు బాబా దక్షిణ అడిగితే ఏం చేయాలి?అని (161). తన వద్దనున్న డబ్బంతా ఖర్చయిపోయింది. కేవలం ప్రయాణం ఖర్చులకు మాత్రమే వున్నది. మరి బాబా దక్షిణ అడిగితే ఎలా? చివరకు అతడు ఒక నిర్ణయానికి వచ్చాడు.(162). బాబా అడిగేలోపలే బాబాకు దక్షిణగా ఒక రూపాయి యిస్తాను. ఆయన మళ్ళీ అడిగితే మరొక్కరూపాయి మాత్రమే యిస్తాను. ఇంకా అడిగితే నా వద్ద రైలు ఖర్చులకు మాత్రమే పైకమున్నదని చెబుతాను'. ఇలా అనుకుని బాబా వద్దకు వెళ్ళాడు(163,164). అనుకున్నట్టుగానే బాబా అడగకముందే దక్షిణగా ఒక రూపాయి యిచ్చాడు(165). అప్పుడు బాబా ఒక కొబ్బరికాయను అతని చేతికిస్తూ యిలా అన్నారు: "ఇదిగో! ఈ కొబ్బరికాయ తీసుకొని నీ భార్య ఒడిలో వెయ్యి. ఇక నీ మనస్సులో ఎటువంటి చింతలూ పెట్టుకోకు. సంతోషంగా యింటికి వెళ్ళు"(166). సరిగ్గా పన్నెండు

మాసాలకు అంటే సంవత్సరానికి అతనికి పుత్రుడు జన్మించాడు. ఎనిమిది మాసాల పిల్లవాడిని తీసుకుని ఆ దంపతులు బాబా దర్శనానికి వచ్చారు(167). ఆ పిల్లవానిని సాయి చరణాల చెంత వుంచారు. అప్పుడాదంపతులు చేతులు జోడించి బాబా ఎదుట నిలబడి యిలా ప్రార్థించారు;(168). "బాబా మీరు మాపై చూపిన కృపకు మేమెలా కృతజ్ఞత తెలుపుకోవాలో అర్థంకావడం లేదు. మీ పాదాలకు మా శిరస్సులు వంచి నమస్కరిస్తున్నాము. హీనులము, దీనులము, పామరులము, అనాధలమూ అయిన మాపై మీ కృపను ఎల్లప్పుడూ ప్రసరింపజేయండి. ఎప్పుడూ తమ చరణాల చెంత మాకు ఆశ్రయం కలుగజేయండి(169). మాకు నిద్ర, మెలుకువ, స్వప్నావస్థలలో గూడ సముద్రపు తరంగాలవలె ఆలోచనలు వస్తూనే వుంటాయి, అలాగాక నిరంతరమూ మేము మీ స్మరణలో వుండేలా అనుగ్రహించండి"(170). తర్వాత వారు సాయికి నమస్కరించుకుని, ఆయన ఆశీస్సులు పొంది భార్యాబిడ్డలతో సంతోషంగా యింటికి వెళ్ళాడు(171). ఆ బిడ్డ పేరు మురళీధరుడు. తర్వాత అతనికి భాస్కరుడు, దినకరుడు అని మరో యిద్దరు పుత్రులు కలిగారు. తర్వాత అతడు జీవితాంతం సాయిని సేవిస్తూ సుఖంగా వున్నాడు.(172,173).

ఈ అధ్యాయం ప్రారంభంలో ఈ లీలను సంక్షిప్తంగా చెప్పాలనుకున్నాను. కానీ నా చేత సాయినాథుడే విస్తారంగా వ్రాయించారు. ఈ హేమాడ్పంతు సాయిని శరణువేడుతూ రాబోయే అధ్యాయంలోని సారాంశాన్ని శ్రోతలను తెలియజేస్తున్నాడు.(174,175). రాబోయే బాబా లీల శ్రోతలకు యింకా ఆనందింపజేసేదిగా వుంటుంది. బాబా యొక్క అద్భుతలీలను చూడాలని తలచిన భక్తుని కోరికను నెరవేర్చారు బాబా (176). భక్తులు సాయి యొక్క సద్గుణ సంపదను వర్ణిస్తారు. కానీ ఎప్పుడూ యితరులలో దోషాలనే చూసే స్వభావం గల వ్యక్తులకు ఆయనలో గూడా దోషాలు కన్పిస్తాయి.(177)." శ్రీ సాయిబాబా నిజంగా మహాత్ముడైతే నాకు నమ్మకం కలిగించాలి. నాకు అనుభవం కలుగనిదే నేను విశ్వసించను" అని కేవలం బాబాను పరీక్షించడానికి వచ్చినవారి కోరికను గూడ నెరవేర్చారు బాబా. ఆ లీలను రాబోయే అధ్యాయంలో చెప్పుకుందాము.(178,179).

స్వస్తిశ్రీ సంతసజ్జన ప్రేరితమైన, భక్త హేమాడ్పంతు విరచితమైన 'శ్రీ సాయి సచ్చరితము'నందలి 'సాశంక భక్తానుగ్రహకరణము' అను నలుబది ఎనిమిదవ అధ్యాయము సంపూర్ణము.

**- సశేషం**

---

జై సాయి మాస్టర్!

దివ్యజనని అలివేలు మంగమ్మతల్లి ఆశీస్సులతో గురుపూర్ణిమ 2009 నుండి శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్‌వారి ప్రచురణలన్నింటిపై ప్రచార నిమిత్తం 35% Discount భక్తులకు శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ తరపున అందజేయుచున్నారు. వివరాలకు.......

08592 - 233271

# పురుషసింహం

సమిత్పాణి

చరిత్రలో ఎందరు మహనీయులు, పురాణపురుషులు అవతరించినా సరే సహజ మానవ బలహీనతల వలన మానవజాతి తిరిగి తిరిగి పతనమవుతుండటం చరిత్ర విదితం. దానిని తిరిగి పునరుజ్జీవనం చేయటానికి ఆ దత్తాత్రేయుడే తిరిగి తిరిగి అవతరిస్తారని పెద్దలు, పురాణాలు, శ్రీగురుచరిత్ర తెలుపుతాయి. వారు అవతరించినా కూడా, ఎంతో అద్భుతమయిన బోధలు చేసినా కూడా ఎక్కువమంది వాటిని అనుసరించక పోవడంచేత అవి లుప్తములై ఉండటం చరిత్రలో చూడవచ్చు. దానికి కారణాలు రెండు.

"ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన" అని సామాన్య మానవజీవితాన్ని నిర్వచించారు పూజ్యశ్రీ ఆచార్యులు. ఎన్ని ఉన్నా ఏదో లేదనే చిత్తశుద్ధి, పట్టుదల లేకపోవటం, తద్వారా ప్రక్కదారులు, దొంగదారులు మనుషులకు అలవాటై సమాజంలో "మామూలే" అన్నట్టు తయారవ్వటం, అవి తిరిగి మరింత అధర్మాన్ని, అన్యాయాన్ని పెంచటం, తద్వారా మరింత అశాంతికి సమాజం గురి అవ్వడం ఒక వొంతు. ప్రతివాడు తనకున్నది చాలక, ఉన్న పరిస్థితి నచ్చక క్రొత్తదనం కోసం, మరో వస్తువు, పరిస్థితికోసమో తపిస్తాడు. అవి తాను సాధించటం తన ఒక్కనివల్లనే కాదని, తాను సంపూర్ణంగా స్వతంత్రుడుకాడని తెలియడం వలన ఆశ, ఊహాలోక విహరణ, వాంఛలు చెలరేగటం మొదలౌతాయి. కార్యదీక్ష గాలిలో కలిసిపోతుంది. అట్టి పరిస్థితి రాదేమోనని, లేకుంటే ఉన్న పరిస్థితి ఊడుతుందేమోనని భయం కలగడం, అట్టి భయం వలన మెరుగైన పరిస్థితిని కోరటం, ఇలా కోరికను భయము, భయమును కోరిక పుట్టించటం, వీటిని దాటలేని తన అసమర్థత, దానిని కప్పిపుచ్చుకోవటానికి నటన, తప్పించుకోవటానికి విలాసాలు మరిగి, కొంతకాలానికి వాటికి బానిస అవ్వటం వలన తిరిగి ప్రయత్నించే సామర్థ్యాన్ని మరింత కోల్పోవటం, కనుక అధర్మాన్ని తొక్కడం ఇంకోవొంతు.

ఈ "ఉన్నదానితో అసంతృప్తి" కారణంగా వెతుకులాట మొదలై వివిధ జీవిత రంగాలలో విశ్వప్రయత్నం చేస్తాము మానవులం. పురోభివృద్ధి కావాలని ఆకాంక్ష దాదాపు ప్రతిఒక్కరికీ ఉంటుంది. శాంతి, ఆనందం, స్వేచ్ఛల కొరకు ఉన్నట్టే ఇలా సమాజంలో ఎక్కువమందికి అట్టి కోరిక ఉండటం వలన సమాజం యావత్తు పురోభివృద్ధి కాంక్షిస్తుంది. అయితే సభ్యులు బలహీనులైనప్పుడు పురోభివృద్ధి కాంక్షించినంతగా వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ కలుగదు. కాబట్టి అట్టి బలహీనతలను పోగొట్టుకునే ప్రయత్నం కూడా జరగాలి. అందుకు అట్టి బలహీనతలే లేని మహనీయులు ఆ స్థితి ఎలా సాధించారో, మనకు ఎలా ఆచరణయోగ్యాన్ని తెలిపారో తెలుసుకుని ఆచరించటం తప్ప మార్గంలేదు. ఇది సమాజంలో ఎక్కువమంది చేస్తేగానీ సమాజం యావత్తు బాగుపడదు.

ప్రకృతిమాత దయా స్వరూపిణి. ఈ పరిస్థితి ఆమెకు తెలుసు. ఎక్కువమందికి అట్టి బలహీనతలను ఒక్క జీవితకాలం పోగొట్టుకోగల సామర్థ్యం ఉండదని తెలుసు. అందుకని సమాజం ఇలానే ఉంటే ఎప్పటికీ బాగుపడకపోగా, తిరోగమిస్తుందనీ తెలుసు. అందుకే తనదైన శైలిలో ఒక అద్భుత అవకాశాన్ని మనకందించింది. జననము, మరణము, ఆయుర్దాయము అనే దైవ నిర్ణీతమైన యంత్రాంగాన్ని అనుసరించి ఎప్పటికప్పుడు శుద్ధమైన మనస్సులు గల పిల్లల రూపంలో తరాలను ఏర్పాటుచేసింది. పాత నీరు కొట్టుకుపోయి కొత్త నీరు వచ్చినట్లు తద్వారా నదులు, చెరువులు తిరిగి తిరిగి పరిశుద్ధమైనట్లు బలహీనతలు అతిక్రమించలేని సభ్యులు ఎక్కువ సంఖ్యలో కలిగిన సమాజం బాగుపడటానికి, సరిగా నడవటానికి సరి కొత్త తరాల వారు మరింత పరిశు

www.saibharadwaja.org www.saimasterforums.org

ద్ధ పడటానికి తిరిగి తిరిగి అవకాశం ఏర్పరుస్తుంది.

ఈ ప్రకృతి సహజమైన విధానాన్ని కొంతైనా గమనించి సమాజానికి పిల్లలు, యువకులు, వారి పురోభివృద్ధి ఎంత అవసరమో తెలుస్తుంది. అందుకు వారి ఆచారవ్యవహారాలు, అభిప్రాయాలు, విద్యాబుద్ధులు ఎంతో చక్కగా, నిర్దుష్టంగా, సర్వతోముఖంగా ఏర్పడాల్సిన అవసరం అర్థమవ్వుతుంది.

సద్గుణాలు, పట్టుదల, ధైర్యము, బలము మొదలైనవి ఎంతగా అవసరమో చెప్పనక్కర్లేదు. "సమాజ పరిస్థితి దృష్ట్యా బలహీనులైన తరాలవారిచేతులలో కొత్త తరాలు సైతం బలహీనం కావటం, కలుషితం కావటం మనం గమనిస్తూనే ఉన్నాము. ఈ విచిత్రమైన "అంటువ్యాధి" తత్వం ఒక తరంనుంచి ఇంకొకతరానికి బలహీనతను అంటించం చూస్తే "విప్లవం", "సత్యాగ్రహం" మాత్రమే సరైన మార్గాలని, వాటికితోడు ఇంకా కలుషితంకాని యువకులకు వివేక వైరాగ్యాలు బోధించటం అవసరమని, అవి లేనిదే అట్టి సరైన "విప్లవం" సాధ్యం కాదని అర్థమవ్వుతుంది.

అట్టి వైరాగ్యాన్ని ధర్మనిరతిని, ధైర్యాన్ని, వివేకాన్ని అందించటానికి మనమధ్యకు మరొక శతాబ్దం క్రితం ఒక ఆధ్యాత్మ సింహం విచ్చేసింది. అదే శ్రీ వివేకానంద స్వామి.

శ్రీ వివేకానందుల జీవితం, వారి బోధలు, వారి గురుసేవ, వారి సాధనాపటిమ, వారి కార్యదీక్ష ఆశ్చర్యజనకములు, ఆదర్శ ప్రాయములుగా నిలుస్తాయి. సంఘ సేవ, సమాజసేవ దగ్గరనుంచి అద్వైతందాకా ముడిపెట్టి సర్వతోముఖమైన అభివృద్ధికి దారి చూపారు శ్రీ వివేకానందులు. అద్వైతం, మాధవసేవ, గురుభక్తి బోధనాదక్షతలు వారిలో తారాస్థాయిని కనబరుస్తూ వ్యక్తిగతంగా పట్టుదల, వైరాగ్యం, సత్యశోధన, వివేకం, సాధనాపటిమలు ఆదర్శాన్ని చూపుతాయి. వారి ప్రబోధాలు ప్రతి వ్యక్తికీ అవసరం. వాటి ద్వారా వారు మనకందించిన స్ఫూర్తి యువకులకు అందటం అత్యవసరం. వారు కనబరిచే, బోధించే ధైర్యం, వివేకము, భక్తి వైరాగ్యాలు వీలైనంతమంది యువకులకు కలగాలి. అట్టివి నేర్పే విద్యాలయాలు కావాలిగానీ ఈ రోజుల్లోలాగా పొట్టకూటి చదువ్వులు చెప్తూ ఈలోగా యువకులను, పిల్లలను శారీరకంగా, మానసింగా కృంగదీసే "అవిద్యాలయాలు" కావ్వు.

యోగము, ధ్యానము, గురుభక్తి, సమాజసేవ, ధర్మనిరతి, ధైర్యము, మతసామరస్యము, మతాలకతీతమైన ఆధ్యాత్మిక జీవనము, దానిని పొందు మార్గము మనకు వారి బోధలలో కన్పిస్తాయి. ఇంతటి మహోన్నత వ్యక్తిత్వం మనమధ్యనవతరించింది జనవరి 12వ తారీకున (తిధి ప్రకారం జనవరి 6). మనమధ్య అవతరించిన అంతటి మహా పురుషుని గురించి తెలుసుకుని, వారి బోధలను అవగాహన చేసుకోవటం అందరికీ ఎంతో అవసరం.

వివేకానందుల గురుదేవ్వులైన పరమహంస శ్రీశారదారామకృష్ణులు వివేకానందులను గురించి చేసిన ప్రశంశలు చూస్తే వివేకానందుల గొప్పతనం ఎంతటిదో అర్థమవ్వుతుంది. వారి బోధలను, వాక్యాలను, జీవత విశేషాలను ముక్కలు చేసి కొన్ని మాత్రమే ఇక్కడ వ్రాయడం అస్సలు సబబుకాదనిపిస్తుంది. అవన్నీ సమగ్రములు కలిపి, కలిసి చదువ్వుకొని తరించాల్సిన విషయాలు, అర్థం చేసుకుని అనుసరించాల్సిన విషయాలు.

అంతటి మహనీయుని జీవితాన్ని పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా యువకులు చదివి, అంతటి వైరాగ్యాన్ని పొందుట ఆవశ్యకం. అలా జరగకుంటే నేటి మనసమాజం బాగుపడటం కనుచూపు మేరలో జరిగే పనికాదు.

అయితే మనకు శ్రీ సాయి ఉన్నారుకదా? మళ్ళీ వివేకానందులు ఎందుకు? అంటారేమో. అలా అనిపించటమే మనకు శ్రీ సాయి దొరికినా

మనలో సంకుచితత్వం అంతరించలేదనడానికి ఋజువు. సకల సాధుస్వరూపులైన శ్రీసాయి వివేకానందులు వేరుకారని, మానవజాతికి ఉన్నతిని ప్రసాదించే శ్రీ సాయి అనుగ్రహమే వివేకానందులని, ఇద్దరూ చెప్పినవి వేరు కావని, ఒకరి బోధలు అర్థమయ్యే కొద్దీ మరొకరి బోధలు మరింత లోతుగా అర్థమవుతాయని మనకింకా వెలగలేదని అర్థం. ఈ విషయాన్నే మాస్టర్‌గారు "శ్రీసాయినాథ ప్రబోధామృతము", "శ్రీ సాయి లీలామృతము", "విజ్ఞాన వీచికలు" మొదలైన గ్రంథాలలో మనకు నిర్దేశించారని గుర్తురాకపోవటం విచారకం. సత్వగుణం లోపించిందనటానికి గుర్తు.

అది గుర్తుంచుకుని, వివిధ మహనీయులు మధ్య "పార్టీ" లను లేవదీయుటంమాని అన్నింటా, అంతటా తాండవిస్తున్న సద్గురులైన దత్తమూర్తిని గుర్తించి, వారి బోధలు దొరికినంతమేరకు అందుకుని, ఆచరించటం మన కర్తవ్యం. అలా చేసే ప్రయత్నాలకు ఫలితంగా తరానికి ఒక్క వివేకానందుడు ఉద్భవించినా చాలు, మనందరి సామూహిక కృషి ఫలించినట్లే. అట్టి సుదినం మన సమాజాన్ని వరించాలని ప్రార్థన. మన మధ్యకు మళ్ళీ రమ్మని శ్రీ వివేకానందులకు నమస్కారపూర్వక ఆహ్వానము. అట్టి ప్రయత్నానికి కావలసిన "వివేకాన్ని", దాని పర్యవసానమైన "ఆనందాన్ని" మనకందరికీ అందించమని సర్వజ్ఞుడైన దత్తాత్రేయునికి ప్రార్థన.

గురురేకో జగత్సర్వం, బ్రహ్మావిష్ణు శివాత్మకం ।
గురోః పరతరం నాస్తి, తస్మాత్సంపూజయేద్గురుం ॥

జై సాయిమాస్టర్

---

Continued from page 17

కదా! 'యోగిని అయిన మాతల్లి మదాలస చనుబాలు త్రావి పెరిగిన మా తమ్ముడు యితర కాంతల బిడ్డలవలే వ్యర్థమైన జీవితము గడిపి పోవలసినదేనా' అనే బాధతో అతనిని ఏదో విధముగా మంచి మార్గములోకి మరల్చాలన్న ఆలోచన నాకు కలిగింది. సుఖలంపటుడైన మాతమ్ముడు మారాలంటే ఒక్కటే మార్గం నాకు స్ఫురించింది. తీవ్రమైన కష్టమేదైనా జీవితంలో సంభవిస్తేనే మనిషిలో దైవచింతన మేల్కొంటుందన్న ఆలోచనతో నేను మీ వద్దకు వచ్చి, అలర్కునిపై లేని నిందలు మోపి మిమ్మల్ని అతనిపైకి యుద్ధానికి ప్రేరేపించాను. దైవానుగ్రహంతో నేననుకొన్నట్లుగానే మావాడు యుద్ధంలో పరాజయంపాలై తీవ్రవేదనతో విరక్తుడై శ్రీదత్తాత్రేయ స్వామి నాశ్రయించాడు. ఆస్వామి దయతో ముక్తిమార్గంవైపు ప్రేరేపింపబడ్డాడు. ఈ విధంగా నేననుకొన్న కార్యం నెరవేరింది. నా ప్రయత్నం ఫలించింది. సన్యాసినైన నాకు రాజ్యమెందుకు? మీవలన మా తమ్ముడు బాగుపడ్డాడు నాకదే చాలు."

సుబహువు మహర్షి చెప్పినదంతా వన్న కాశీరాజు ఎంతో సంతోషించాడు. యోగమార్గరతులైన ఆ యిరువులు అన్నదమ్ములకు భక్తిప్రపత్తులతో నమస్కరించి, సుబాహువుమహర్షితో యిలా అన్నాడు. "ఓ మహాత్మా! మీదర్శనంతో నా జన్మ ధన్యమైంది. మీరు మీసోదరుని నిమిత్తము కార్యార్థియై నా వద్దకు రావటం నా అదృష్టం. ఇంతకాలం మీకు మారాజ్యంలో ఆశ్రయం యివ్వటం మా జన్మ జన్మల పుణ్య ఫలం. స్వామీ! నాదొక మనవి. మీరు నీతమ్మునికి మంచి మార్గం చూపారు కానీ, అజ్ఞానాంధకారంలో మునిగివున్న నాకు ఏదారీ చూపించకనే మీదారిని మీరు వెళ్ళిపోతామంటున్నారు. ఇది మీకు న్యాయమేనా? నాపై దయ చూపి నాకూ యింత జ్ఞానభిక్ష పెట్టి నన్నుద్ధరించవలసిందిగా వేడుకొంటున్నాను."

- సశేషం

# అల్లా చూపిన క్షమకు 'బానిస' మాలిక్ దినార్

అవధూత పుత్ర

మహనీయుడైన హసన్ బస్రాకు మాలిక్ దినార్ అనే శిష్యుడు వుండేవాడు. ఇతడు జన్మతః కాబూలులో జన్మించిన బానిస. ఇతడు ఎంతో అందగాడు, ధనవంతుడు అయ్యాడు. ఇతనికి మొదట ప్రాపంచిక సుఖాలపట్ల ప్రీతి ఎక్కువ. ఆ రోజులలో అతడు డమాస్కస్ నగరంలో జీవించేవాడు. ఆ నగరంలో ఒక అందమైన మశీదు వుండేది. దానికి నిధులుకూడా ఎక్కువగా వుండేవి. ఎలాగైనా ఆ మశీదుకి నిర్వాహకుడుగా వుండాలన్న కోర్కె అతనికి కల్గింది. అందుకొక యుక్తిననుసరించాడు. ఒకరోజు ఆ మశీదులో ఒక మూల తన రగ్గును పరుచుకొని దానిమీద నిరంతరం ప్రార్థనలో కూర్చునేవాడు. మశీదుకు వచ్చిపోయే ప్రతివారు తన్నుచూచి, "ఇతడెంత శ్రద్ధాభక్తులు కలవాడో!" అనుకోవాలని అతని ఉద్దేశ్యము. అతడి మనస్సుమాత్రం, "మాలిక్, నీవెంత వంచకుడవు!" అని అతణ్ణి ఆక్షేపిస్తూ వుండేది. ఇలా ఒక సంవత్సరం గడిచింది. పగలంతా, జనం తిరిగేటప్పుడు, ప్రార్థన చేస్తున్నట్లు కూర్చుంటూ, రాత్రి సమయాలలో విలాస జీవితం గడుపుతుండేవాడు. ఒకరోజు అతడు ఆనందంగా సంగీతం వింటున్నాడు. అతని స్నేహితులంగా నిద్రపోయారు. అతను మాత్రం ఒక తంతు వాయిద్యంమీద ఒక పాట వాయిస్తున్నాడు. అకస్మాత్తుగా ఆ వాయిద్యం నుండి ఒక అశరీరవాణి, "మాలిక్! ఎంతకూ నీకు పశ్చాత్తాపం కలగదేం?" అని మందలించింది. అతను బిత్తరపోయి ఆ వాయిద్యాన్ని అక్కడే పడేసి పరుగున మసీదు చేరాడు. "ఒక సంవత్సరం పొడుగునా భగవంతుని మిథ్యా ప్రార్థన చేసాను, అదే సమయంలో హృదయపూర్వకంగా ప్రార్థించి వుంటే ఎంత బాగుండేది?" అన్న భావం కలిగింది. ఇకనైనా ఆ క్షుద్రమైన బాదరబందీని ఆశించేకన్నా తనకున్న దానితో తృప్తిపడి నిరంతరము ప్రార్థనలో నిమగ్నుడవ్వాలని నిశ్చయించుకున్నాడు. తక్షణమే తన దుశ్చర్యకు తీవ్రంగా పశ్చాత్తాపముచెంది భగవంతుని క్షమాపణ వేడుకొని రాత్రంతా ఏకాగ్రమైన మనస్సుతో హృదయపూర్వకంగా ప్రార్థించాడు. తెల్లవారుతూనే యథాప్రకారం భక్తులెందరో మశీదువద్దకు చేరారు. వారు ఆ మశీదు గోడలను చూస్తూ, "గోడలు బీటలు వారుతున్నాయి. దుమ్ముకూడా పట్టింది. దీనిని సక్రమంగా వుంచటానికి ఒక నిర్వాహకుడు అవసరం" అని చర్చించుకొని ఆ పనికి 'మాలిక్' వంటి శ్రద్ధావంతుడే పనికివస్తాడని తీర్మానించుకొని అతణ్ణి అడిగారు. "ఓరి భగవంతుడా! నేను మిథ్యా ప్రార్థనలుచేస్తూ యీ పదవికోసం పడిగాపులు పడ్డంతకాలం నన్ను కన్నెత్తి చూచినవాడు ఒక్కడైనా కనపడలేదు. నేనా దురాశను విడిచి నా హృదయాన్ని నీ సేవకే అంకితం చేసుకొన్న క్షణంలో యింతమంది వచ్చి యీ భారం నాపై వెయ్యాలని చూస్తున్నారు. దయతో నాకీ బాధ తగ్గించు!" అనుకొన్నాడు మాలిక్. వెంటనే అతడు మశీదునుండి పరుగెత్తిపోయి ఒక ఏకాంత స్థలంలో తీవ్రమైన తపస్సుచేశాడు. అందువలన అతడి కీర్తి దశదిశల వ్యాపించింది.

ఆ రోజులలో బస్రాకు చెందిన ఒక గొప్ప ధనికుడు మరణించాడు. అతనికి ఎంతో అందమైన ఒకే ఒక్క కూతురు వున్నది. ఆమె మాలిక్ యొక్క కీర్తినిచూచి ఆయనను వివాహమాడితే తానుకూడా ఆధ్యాత్మికంగా పురోగమించవచ్చునని ఆశించి ఒక పెద్ద మనిషితో చెప్పింది. ఆ కబురు వింటూనే మాలిక్ యిలా అనుకొన్నాడు. ఇదివరకంతా నేనొకవంక స్త్రీ సౌందర్యముకోసము, సౌశీల్యముకోసము, మరొకవంక సిరిసంపదల కోసమూ ప్రాకులాడాను. కాని అంతకాలము ఒక స్త్రీలో అందముంటే, సౌశీల్యము, ధనము వుండేవికావు. సౌశీల్యముంటే అందమూ సిరిసంపదలుండేవి కావు. సిరిసంపదలుంటె అందము, సౌశీల్యం లోపించేవి. ఇప్పుడు అవి అన్నీ వద్దనుకున్న తరువాత యివన్నీ యిలా వెంటపడతాయేమి?' అని విస్తుపోతూ ఆ పెద్దమనిషితో ఇలా అన్నాడు. "నేను లౌకిక జీవితాన్ని పరిత్యజించాను. స్త్రీలౌకిక జీవితానికి సంబంధించినది కనుక నేనామెను

www.saibharadwaja.org www.saimasterforums.org

వివాహమాడలేను".

మాలిక్ దినార్ కుటీరానికి ప్రక్క ఇంట్లో ఎంతో దుశ్శీలుడైన యువకుడుండేవాడు. అతడి దుశ్చర్యలు మాలిక్‌నెంతో కలత పర్చేవిగాని తానొక్కడే ముందుగా బయటపడటమెందుకని అతను ఓర్పువహించాడు. కొద్దికాలానికి ఆ యువకుని దుశ్చర్యలకు రోతచెందిన పొరుగువారంతా మాలిక్‌తో మొరపెట్టుకొని ఆ యువకుని మందలించమని కోరారు. అందరి తరపునా మాలిక్ వెళ్ళి ఆ యువకునితో, "నీ నడవడి ఏమి బాగాలేదు. నీ పద్ధతి మార్చుకోకుంటే రాజుతో ఫిర్యాదుచేస్తాను" అన్నాడు.

"చెప్పుకో పో రాజుకు నేనంటే పిచ్చి వ్యామోహం. నేను ఏమిచేసినా, నా మీద ఎందరు ఫిర్యాదుచేసినా నన్ను ఆయన ఆటంకపరచలేదు".

"అయితే విశ్వానికంతటికి ప్రభువైన 'అల్లా'కు నీపై ఫిర్యాదుచేస్తాను" అంటూ ఆకాశంకేసి వేలుచూపాడు మాలిక్. ఆ యువకుడు పకపకా నవ్వుతూ "ఆయనా! ఆయనెంతో దయామయుడు. ఎన్నో తప్పులు చేసేవరకు మానవుణ్ణి క్షమిస్తూనే యుంటాడు. నన్ను అంత తొందరగా శిక్షించడు".

మాలిక్ నిరుత్తరుడయ్యాడు. తాను ఖురానునుండి క్షుణ్ణంగా చదివి తెలుసుకొన్న సత్యమదే. ఒక్కసారి అతని హృదయంలో తన గత జీవితమంతా గిర్రున చక్రంగా తిరిగింది. సాక్షాత్తూ ప్రార్థనాలయంలో సంవత్సరంపాటు కపటప్రార్థన చేసినా, అంతకుముందు ఎంతో విశృంఖలంగా జీవించినా అల్లా తననేమీ చేయనిమాట నిజమేగదా! బదులుచెప్పలేక అతడు వెళ్ళిపోయాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఆ యువకుడి చర్యలు యింకా మితిమీరాయి. పొరుగువారందరూ మరొక్కసారి ఆయనతో ఫిర్యాదుచేసుకొన్నారు. గత్యంతరం లేక అతన్ని మందలించడానికి బయలుదేరాడు. అవసరమైతే అతణ్ణి దండించాలనికూడా అనుకున్నాడు.

నాలుగడుగులు వేశాడోలేదో అతడికొక దివ్యవాణి విన్పించింది. "నా మిత్రునిమీద చేయి చేసుకున్నావో, లేక నోరు పారేసుకొన్నావో జాగ్రత్త!" నివ్వెరపోయి మాలిక్ నెమ్మదిగా ఆ యువకుని గదిలో ప్రవేశించాడు. "యింతలో ఏం ముంచుకొచ్చింది. మళ్ళా వచ్చావేం?" గదమాయించాడు యువకుడు.

"ఈసారి మందలించడానికి రాలేదు. నాకొక అశరీరవాణి వినిపించిందని చెప్పడానికి మాత్రమే వచ్చాను".

"అది తెలిసేనా భవనమంతటినీ భగవంతుని సేవకే అర్పించివేస్తున్నాను. నాకిక ఈ లౌకిక సంపదలతోటి పనేలేదు" అంటూ తక్షణమే సర్వాన్ని విడచి భగవదన్వేషణలో పరివ్రాజకుడై వెళ్ళిపోయాడు.

చాలాకాలం తర్వాత మాలిక్ అతడ్ని మక్కాలో కలుసుకొన్నాడు. అప్పుడతడు దుర్భరమైన దారిద్ర్యములో మునిగి వుండడమేగాక భయంకరమైన వ్యాధితో మృత్యుముఖంలో వున్నాడు. మాలిక్ ప్రేమగా అతని కళ్ళల్లోకి చూస్తూ "ఎలా వున్నావు?" అని అడిగాడు.

"ఎంతైనా అతడు నా స్నేహితుడుగదా! నేను అతన్ని వెంటనే చూడాలి" అంటూ శాశ్వతంగా కన్నుమూశాడు.

జీవితంలో పరమార్థము తప్ప సంతోషంగా నవ్వుకో తగిన విషయమే లేదని మాలిక్‌కు మరొకసారి ధృవపడింది.

వచ్చే సంచికలో మాలిక్‌దినార్ గురించి మరో వ్యాసం ప్రచురించబడుతుంది.

– ఎడిటర్

# హజరత్ తాజుద్దీన్‌బాబా జననము–సాధన

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

(ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో క్రీ॥శ॥ 1850–1950 మధ్య కాలము ఎంతో విశిష్టమైనది. కారణం ఈ మధ్య కాలంలోనే శ్రీ శిరిడీ సాయిబాబా, మరి కొందరు మహా సిద్ధపురుషులు ఆధ్యాత్మిక పథంలో భౌతికంగా దర్శనమిచ్చారు. ప్రపంచ ఆధ్యాత్మిక జీవితాన్ని నడిపించే ఒక మహాత్ముల చక్రముందని, ఆ చక్రానికి 72మంది వివిధ మతాలకు చెందిన సిద్ధ పురుషులు చక్ర పత్రాలయితే శ్రీ శిరిడీ సాయినాథుడు ఇరుసులా వుంటారని – ఒక సాంప్రదాయం. వారిలో శ్రీ శిరిడీ సాయిబాబా సమగ్ర జీవిత చరిత్రను, వారి సమకాలికులైన మరి నలుగురు ప్రసిద్ధ సిద్ధపురుషుల–శ్రీ స్వామి సమర్థ (అక్కల్‌కోట), శ్రీ తాజుద్దీన్‌బాబా (నాగపూర్), శ్రీ గజానన్ మహారాజ్ (షేగాం), శ్రీ ధునీవాలాదాదా (ఖాండ్వా) – చరిత్రలను ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు ఆంగ్లంలోనూ, తెలుగులోనూ రచించారు. వారిలో శ్రీ సాయిబాబా, శ్రీ స్వామి సమర్థుల చరిత్రలను సాయిబాబా మిషన్ ప్రచురించింది. ఈ సంచిక నుండి శ్రీ తాజుద్దీన్ బాబా సమగ్ర జీవిత చరిత్రను ధారావాహికంగా ప్రచురిస్తున్నామని తెలుపుటకు ఆనందిస్తున్నాము. – ఎడిటర్)

అది ఆగష్టు 17, 1925వ సంవత్సరము. ఆనాడు జరిగిన రెండు సంఘటనలు నాగపూర్ వాసులను ఆవేదనలోనూ ఆశ్చర్యంలోనూ ముంచివేశాయి. హజరత్ తాజుద్దీన్‌బాబా ఆ రోజే సమాధి చెందడం వారి ఆవేదనకు కారణమైతే, పండరి విఠల్, రుక్మాదేవి విగ్రహాలు పండ్రెండు గంటలసేపు సంతత ధారగా కన్నీరు కార్చడం వారి ఆశ్చర్యానికి కారణం. విగ్రహారాధనను నిరసించే ముస్లిం మతానికి చెందిన ఫకీరు హజ్రత్ తాజుద్దీన్‌బాబా సమాధి చెందితే హిందూ దేవతా విగ్రహాలు దుఃఖించడం విచిత్రం కాదా! దైవం హిందువా? ముస్లిమా? అసలు ఆయన మతమేది?

ముస్లిములచేత పీర్ (గురువు)గా, హిందువులచేత భగవదవతారంగా కీర్తించబడిన తాజుద్దీన్ బాబా పూర్వీకులు అరబ్బు దేశంవారు. హజరత్ ఇమామ్ ఆస్కార్ అనే ఆయన మనుమడైన సయ్యద్ అబ్దుల్లా అరేబియా దేశంనుండి హిందూ దేశానికివచ్చి మద్రాసులో స్థిరపడ్డారు. చాలాకాలంగా ఆయన సంతతివారంతా మద్రాసు పరిసర ప్రాంతంలోనే నివసించేవారు. వారి వంశంలోని వాడే సయ్యద్ బద్రుద్దీన్. సయ్యద్ బద్రుద్దీన్ సైన్యంలో చేరి 'మద్రాస్ ప్లాటూన్ – 32' లో సుబేదారుగా వుంటూ కాంప్టి అనే ఊళ్ళో వుండేవాడు. అతను షేక్ మీరాన్ సాహెబ్ గారి కుమార్తె అయిన మీరాన్‌బీని వివాహం చేసుకున్నాడు.

సం॥ 1861 జనవరి 27వ తేదీన గురువారం ఉదయం గం.5–15 నిమిషాలకు మీరాన్‌బీకి కొడుకు పుట్టాడు. ఆ పిల్లవానికి తాజుద్దీన్ అని పేరు పెట్టారు. అయితే తాజుద్దీన్ అందరి పిల్లలవలె ఏడువలేదు. తల్లిదండ్రులు శిశువులో జీవం ఉన్నదో లేదోనని అనుమానించి గాభరాపడి శిశువుకు చైతన్యం కలిగించడంకోసం వారి ఆచారం ప్రకారం శిశువు కణతలమీద ముఖంమీద కాల్చారు. వెంటనే శిశువు తాను జీవించే వున్నానని తెలుపడానికేమో అన్నట్లు కొద్ది క్షణాలు మాత్రమే రోదించి ఊరుకొని కళ్ళు తెరచి అన్ని వైపులకూ చూడడమారంభించాడు. మహాత్ముడైన తాజుద్దీన్ ముఖంమీద ఆనాడు కాల్చిన ముద్రలు శాశ్వతంగా వుండిపోయాయి.

తాజుద్దీన్ తల్లిదండ్రులకు ఆయనను బాబా తాజుద్దీన్‌గా చూచే అదృష్టం లేకపోయింది. తాజుద్దీన్ పుట్టి సంవత్సరం తిరగకముందే అతని తండ్రి బదురుద్దీన్ చనిపోయాడు. ఆయనకు 9వ సం॥ రాగానే తల్లిగూడ గతించింది.

www.saibharadwaja.org www.saimasterforums.org

తండ్రి చనిపోయాక తాజుద్దీన్ వారి అమ్మమ్మగారి యింటివద్దనే పెరిగాడు. అతని ఆరవ ఏట స్కూల్‌లో చేర్పించారు. 6వ సం॥ నుంచీ 18వ సం॥ దాకా తాజుద్దీన్ అరబ్బీ, పార్శీ, ఇంగ్లీషు భాషలు నేర్చుకున్నారు.

**ఆశీర్వాదం**

తాజుద్దీన్ చదువుకునే బడికి ఒకసారి ఆ ప్రాంతంలో ప్రఖ్యాతిగాంచిన ముస్లిం మహాత్ముడు హజరత్ అబ్దుల్లాషా వచ్చారు. అప్పుడు తాజుద్దీన్ ఒకటో తరగతిలో వున్నాడు. ఆ మహాత్ముడు తాజుద్దీన్ వైపు దృష్టి నిగిడ్చిచూచి సంచిలో నుండి కొంత మిఠాయిని తీసి కొంచెం చప్పరించి తాజుద్దీన్ నోట్లో వేశారు. తరువాత ఆ ముస్లిం ఫకీర్ ఉపాధ్యాయులతో తాజుద్దీన్‌ను చూపుతూ "ఇతనికి మీరేం బోధించగలరు. ఇతని విద్యాభ్యాసం ఇదివరకే పూర్తయింది" అన్నారు! "మితంగా తిను, మితంగా మాట్లాడు. ఖురాన్ చదివేటప్పుడు మహమ్మదులవారే నిన్నావేశించినట్లు భావయుక్తంగా పఠించు" అని తాజుద్దీన్‌తో చెప్పి ఆశీర్వదించి వెళ్ళారు.

హజరత్ అబ్దుల్లాషా ఆశీర్వదించి వెళ్ళాక తాజుద్దీన్‌లో వింతైన మార్పు వచ్చింది. ఏదో పారవశ్యం అతనిని ముంచివేసింది. మూడు రోజులుపాటు ఆగకుండా అతని కళ్ళవెంట సంతతధారగా ఆనంద భాష్పాలు కారాయి. ఆ తర్వాత తాజుద్దీన్‌కు ఆట పాటలయందు ఆసక్తి తగ్గింది. ఎప్పుడూ ఒంటరిగా గడిపే తాజుద్దీన్ పుస్తకాలు చదివి అర్థం చేసుకునే జ్ఞానం కలిగాక గొప్పగొప్ప సూఫీ మహాత్ములు రచించిన గ్రంథాలను చదువుతూ క్రమంగా అద్భుతమైన వారి జీవిత విధానాల వైపుకు ఆకర్షితుడయినాడు.

అతను చదివిన వాటన్నింటిలోకి ఒక గొప్ప ముస్లిం మహాత్ముడు చెప్పిన ద్విపద ముస్లిం తాజుద్దీన్ హృదయాన్ని ఆకట్టుకుంది. దాని భావమేమంటే,

"సారాయం త్రాగు!
ఖురాన్, కాబాలను తగులబెట్టు!
కావాలంటే దేవాలయాల్లో నివసించు!..... కాని....
ఏ మానవుని హృదయాన్నీ ఎన్నడూ గాయపరుచకు!!"

గొప్ప మహాత్ముడైన హజరత్ అబ్దుల్లా షా ఈ ద్విపదను కేవలం సాహిత్య పరమైన అర్థంతో చెప్పారనుకోవటం సరికాదనిపిస్తుంది. సూఫీ మహాత్ములు వ్రాసే అటువంటి ద్విపదలు భావగర్భితమైన పరిభాషలో వుంటాయి. ఆ పదాలలో పైకి ప్రకటమయ్యే అర్థంగాక లోతైన ఆధ్యాత్మిక సత్యాలు యిమిడివుంటాయి. సామాన్యంగా వారు ఆధ్యాత్మిక అనుభూతులను గురించి చెప్పేటప్పుడు ప్రేమ, తాగుడు, మైకంలాంటి పదాలను వాడుతూ వుంటారు. పైన చెప్పిన ద్విపదలో 'సారాయం త్రాగు' అంటే భగవంతునిపై భక్తితో పారవశ్యం చెందు అని భావం ఖురాన్ అంటే కేవలం కొన్ని కాగితాలు, వాటిపై ముద్రించపడ్డ రంగు సిరామాత్రమే కాదనీ, పవిత్రమైన కాబా అంటే కేవలం ఒక నల్లని రాతిముక్క మాత్రమే కాదనీ, అవి రెండూ కేవలం నామరూప సహితమైన వస్తువులనే భావాన్ని వదలి వాటికాధారంగా, అతీతంగా వున్న శాశ్వతానందాన్ని పొందడమే – ఖురాన్, కాబాలను తగులబెట్టటమంటే! దేవాలయాల్లో నివసించడమంటే ఎవరి మత ధర్మాలను వారినాచరించుకోనీమనీ, ఎవరి నమ్మకాలనూ, ఆచారాలనూ వారిని పాటించుకోనీమనీ భావం. అయితే ఈ మూడూ ఆచరించినా, ఆచరించక పోయినా ఇతరుల హృదయాన్ని ఎన్నడూ గాయపరచకూడదనే ఉత్తమ ధర్మాన్ని పాటించమని ఆఖరి పాదంలోని భావం. తాజుద్దీన్ బాబా జీవిత చరిత్ర అంతా

ఆయన హృదయాన్ని ఆకట్టుకున్న ఈ సత్యాలను గూర్చిన మౌన వ్యాఖ్య.

తాజుద్దీన్ 18వ ఏట కాంప్టీ దగ్గరగా వున్న కంమాన్ అనే నదికి తీవ్రంగా వరదలు వచ్చాయి. ఆ వరదలకు అపారమైన జన నష్టం. ఆస్తుల నష్టమూ జరిగింది. ఎంతోమందికి నిలువ నీడ, తినటానికి తిండీ లేకుండా పోయింది. వరద బాధితుల కష్టాలను చూచి తాజుద్దీన్ హృదయం చలించింది. తల్లిదండ్రులు పోయాక తాజుద్దీన్‌కు ఆశ్రయమిచ్చిన మేనమామ హజరత్ అబ్దుల్ రహమాన్ గారి యిల్లుకూడ కూలిపోయి, ఆయనకూ ఎంతో నష్టం వచ్చింది. ఇల్లు గడవడం కోసం ఆయన అటవీశాఖలో పనిచేయవలసి వచ్చింది. ఆయనే సైన్యంలో చేరమని సలహా యివ్వడంతో తాజుద్దీన్ తన 20వ యేట 1881వ సం॥లో 13వ నాగపూర్ రెజిమెంటులో చేరాడు. సైన్యంలో వుండగా తాజుద్దీన్ ఉద్యోగ నిర్వహణలో దేశం నలుమూలలా తిరిగాడు. ఫ్రాన్స్ మొదలైన విదేశాలలో కూడా ఆయన పర్యటించాడు. విదేశాల నుండి వచ్చాక వారి రెజిమెంట్ హైదరాబాద్‌లో గ్రాస్‌ఫారం అనేచోట స్థావరమేర్పరచుకుంది. అక్కడ వుండగానే 'బెంజ్' అనే అమెరికన్ అధికారి తాజుద్దీన్‌తో పరిచయమేర్పరచుకొని ఆయన వద్ద ఖురాన్ అంతా నేర్చుకున్నాడు. విలియమ్స్ అనే ఆయనకూడా తాజుద్దీన్‌కు సన్నిహితుడై ఆధ్యాత్మికంగా పురోగతి పొందాడు. తర్వాత విలియమ్స్ కలకత్తా వెళ్ళాడు. అక్కడ బంగ్‌మేరి అనేచోట విలియమ్స్ సమాధిని మనం నేటికీ చూడవచ్చు.

సం॥ 1884లో తాజుద్దీన్ సైనిక దళం సాగర్ అనే చోటికి చేరింది. సైన్యంలో పనిచేసే రోజుల్లో కూడా తాజుద్దీన్ నమాజ్ చేయడంలో ఎప్పుడు అశ్రద్ధ చూపలేదు. సాగర్‌లో వుండేటప్పుడే ఒక రోజున తాజుద్దీన్‌కు అతి మధురమైన గానం వినిపించింది. ఆ గానం చేస్తున్న వారెవరో వెతుక్కుంటూ బయల్దేరి ఊరు బయట నివసిస్తున్న హజరత్ దావూద్‌షా ఛిస్తీ అనే ముస్లిం మహాత్ముని నివాసం చేరాడు. అది మొదలు ప్రతిరోజు తన ఉద్యోగధర్మం ముగిసాక తాజుద్దీన్ ఆ మహాత్ముని సాంగత్యంలో గడిపేవాడు.

ఆయన సన్నిధిలో ఎంతోసేపు ధ్యానం చేసేవాడు. తరచుగా రాత్రంగా అక్కడే గడిపి తెల్లవారాక శిబిరానికి వెళ్ళేవాడు. తాజుద్దీన్ రాత్రిళ్ళు తరచుగా ఎటో వెళ్తున్నాడని కాంప్టీలోవుండే ఆయన బామ్మ గారికి తెలిసింది. తాజుద్దీన్ చెడు సావాసాలు చేస్తున్నాడేమోనని తలచిన ఆమె మనవణ్ణి మందలించడానికి సాగర్ వచ్చి రహస్యంగా ఒకరోజు రాత్రి తాజుద్దీన్‌ను వెంబడించింది. తాజుద్దీన్ నేరుగా ముస్లిం మహాత్ముని వద్దకు వెళ్ళి దైవధ్యానం చేసుకుంటూ వుండడంచూచి సంతోషంగా తిరిగివచ్చింది. మరునాడు ఉదయమే తిరిగివచ్చిన తాజుద్దీన్‌కు ప్రేమతో ఫలహారం అందించింది బామ్మగారు. కానీ తాజుద్దీన్ వాటిని తినక తనచేతిలో ఉన్న రెండు రాళ్ళను బామ్మగారికి చూపిస్తూ "ఇవిగో నా దగ్గర లడ్డూ, జిలేబీ వున్నాయి" అంటూ వాటిని నోట్లో వేసుకుని చప్పరిస్తూ తినేశాడు. తాజుద్దీన్ చేసిన ఈ పని బామ్మ గారిని ఆశ్చర్యంలో ముంచేసింది. దైవచింతనలో ఎక్కువసమయం గడపడం వల్ల తాజుద్దీన్‌లో అతీతశక్తులు మేల్కొన్నాయని గుర్తించిన బామ్మగారు మనుమడు ఏ దుష్టసాంగత్యానికీ లోనుకాలేదని సంతోషిస్తూ తిరిగి కాంప్టీ చేరింది. హజరత్ దావూద్ ఛిస్తీ కొద్దికాలం తర్వాత మరణించారు. ఆ తర్వాత కూడా తాజుద్దీన్ ఆయన సమాధి వద్ద ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించారు.

– శ్రీ హజరత్ తాజుద్దీన్‌బాబా దివ్య చరిత్ర నుండి

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రాప్తిస్థానం: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka
Ongole - 523 002, 08592-233271

www.saibharadwaja.org www.saimasterforums.org

# జీవన విధానం

–ద్వారకానాథ్

"శ్రీ సాయినాథ ప్రబోధామృతం"లో మాస్టర్‌గారు శ్రీ సాయి గురించి వారి బోధల గురించి, తత్వాన్ని గురించి వ్రాసినంత అద్భుతంగా మరెవ్వరూ రాయలేదని, లేరని అంటే అతిశయోక్తి కాదు. శ్రీ సాయి బోధలను అంతగా వివరించగలగాలంటే వీరి ఆధ్యాత్మిక స్థితి ఎంతటిదో అర్థమవుతుంది. పూజ్య గురుదేవులు ఒక ఆంతరంగికురాలితో "ఇక్కడ ఎవరున్నారనుకున్నావ్? దత్తాత్రేయుడు! నా రూపాన్ని మనసులో నిలిపి ధ్యానించు. అంతే చాలు" అన్నారు. ఆయనకు అనేకమంది మహనీయులు ఇచ్చిన ప్రసంశలు చూచినా, భక్తుల అనుభవాలను లోతుగా పరిశీలించినా వారి స్థాయి ఏమిటో కొంచెం అర్థమవుతుంది. అది అగాధమని అర్థమవుతుంది. ఆయనే ఒకసారి ఒక భక్తునితో "నా అంతరాంతరాళలలో నేనెవరినో ఎవరూ ఎప్పటికీ తెలుసుకోలేరు" అన్నారు. ఎంత సత్యం!

అంతటి దివ్య పురుషుని జీవన విధానం చూస్తే అది ఎంత నిర్దుష్టంగా ఉంటుందో అంత నిర్మలంగా ఉంటుంది. ఎంత విశాలంగా ఉంటుందో అంత నిగూఢంగా ఉంటుంది. వారి ప్రతి మాట, కదలిక ఎంత శక్తివంతంగా ఉంటాయో అంత నిరాడంబరంగా, సహజంగా ఉంటాయి. ఆయన స్థాయి, ఆధ్యాత్మిక స్థితి ఎంత గొప్పవో ఆయన అంత సామాన్యంగా, సబబుగా జీవించారు. ఆయన ఎంత స్వతంత్రుడో అంత సాయి సేవకుడు. శ్రీ సాయి చెప్పిన మార్గాన్ని, బోధలను, జీవిత విధానాన్ని నిర్దుష్టంగా ఆచరించి చూపారు శ్రీ మాస్టర్‌గారు. అందుకని "మాస్టర్‌గారు ఎలా ఉండేవారు? ప్రవర్తించేవారు? ఆలోచించేవారు?'' అనేది తెలియాలంటే, సాయి చెప్పిన జీవన విధానమేమిటోతెలియాలి. ఈ రెంటిలో ఏది తెలిసినా రెండవది అర్థమవుతుంది. ఏది తెలియకున్నా రెండవది తెలియదు.

శ్రీ సాయి గురించి, ఆ మార్గాన్ని గురించి పూజ్య గురుదేవులు "శ్రీ సాయినాథ ప్రబోధామృతం"లో కొన్ని అమూల్య వాక్యాలుగా తెలియపరచారు. వాటిని పరిశీలిస్తే ఆ జీవిత విధానమేమిటో అర్థమవుతుంది.

**1. " సరైన సాయిభక్తునికి సహస్రాక్షములు, సహస్రముఖములు గల ఈ ప్రకృతే గురురూపం".**

సాయి తమ బోధల ద్వారా, ఆచరణ ద్వారా, లీలల ద్వారా, " అల్లామాలిక్" అనే తమ స్మరణ ద్వారా మనకు తెలిపిన సత్యమదే. "గురు మధ్యే స్థితం విశ్వం..." అన్న గురుగీతా శ్లోకం కూడా అదే చెప్తుంది. ఏ విశ్వచైతన్యమయితే "నేననేకమగుదును గాక" అని సంకల్పించిందో, ఏ సంకల్పాన్ని అనుసరించి ఈ యావత్ సృష్టి సృజింపబడినదో, ప్రకృతే ఇన్నిరూపాలూ ధరించి, ప్రకృతి సూత్రాలకనుగుణంగా ఈ జగన్నాటకాన్ని నడుపుతున్నదో, ఏది ఇన్ని రూపాలు ధరించి నిలుపుతున్నదో అదే మానవాకృతిలో మానవోద్ధరణకై రావడమే కదా గురుతత్వం? దీనినే "సహస్రశీర్షాపురుష:...." అన్న పురుషసూక్త శ్లోకం వివరిస్తుంది. అట్టి భగవంతునికి నమస్కరిస్తూ పలుకుతుంది "నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే..." అన్న శ్లోకం. అదే సత్యాన్ని మనకు బోధిస్తుంది "గురరేకోజగత్సర్వం..." అన్న గురుగీతా శ్లోకం.

శ్రీ సాయి కూడా తమ లీలల ద్వారా, ఆచరణ ద్వారా, ఈ యావద్విశ్వమూ తమరూపమేనని నిరూపించారు కదా! మరి అట్టి సాటిలేని

గురువుయందు భక్తి అంటే ఆయన రూపమయిన ఈ యావద్విశ్వంపట్ల భక్తి శ్రద్ధలుండాలి కదా? అంటే ప్రతి ప్రాణి, పరిస్థితి, వస్తువు పట్ల మనభావం అంత ఉన్నతంగా ఉండాలి కదా? అలా లేకుంటే దానికి ఒక్కటే అర్థం. "సాయి" అంటే అంతటివారనే అభిప్రాయానికి బదులు మనకు మనమే ఒక పరిమిత అభిప్రాయాన్ని కలిగివుండి, దానికి "సాయి" అని, "మాస్టర్" అని పేర్లు పెట్టుకుని, మన పరిమిత అభిప్రాయం పై మనకున్న భక్తిని బాబా భక్తిగా భ్రమిస్తునట్లే! కానీ గురుదేవుల ఆచరణ, వైఖరి చూస్తే మాత్రం ఆయనకు ఈ యావద్విశ్వము "సాయి రూపంగా" గోచరించేది అనక తప్పదు. పరిపూర్ణునికి యావద్విశ్వము తన రూపంగానే గోచరిస్తుంది. కానీ గురువుతో అద్వైతం ప్రదర్శించక, వినమ్రతతో మసులుకోవాలని కదా ధర్మం? శ్రీ సాయి కూడా తానే విశ్వానికి యజమాని అయి ఉండి కూడా "అల్లా మాలిక్" అంటుండేవారు కదా!

సర్వం సాయిమయమన్న అనుభవం మనకు లేదుకదా అనవచ్చు. కానీ అనుభవం లేకున్నా, భావం కలిగియుండటం, దానికి తగ్గట్లు ప్రవర్తించటానికి ప్రయత్నం చేయడానికి అడ్డేమిటి? అట్టి ప్రయత్నం ఎంత నిజాయతీగా చేస్తున్నామన్నది మన తపనకు నిదర్శనం. అట్టి ప్రయత్నం చేసేవారిలో అలవడే ధర్మాచరణ, వినమ్రత, నిర్భయత్వము మనలో కనిపిస్తున్నాయా? సర్వమూ సాయిమయమని నిజంగా నమ్మటానికైనా దమ్ము ఉందా? చూడబోతే చాలామందికి ఉన్నదనటానికి లేదు. మరి అది మాత్రం ఎట్లా కలుగుతుంది?

అది కలిగించటానికి, దానికి చేయాల్సిన ప్రయత్నాన్ని మనకవగతం చేయటానికే కదా గురువున్నది. అట్టి బోధ, ఆ బోధను అందించే తత్వమే గురువు. ఆ గురువు సర్వవ్యాపి కనుక ఆయన బోధ నిరంతరం, సహస్రముఖాలతో మనకు బోధ చేస్తూంటుంది. అందుకే మాస్టర్‌గారు అంటారు "నిరంతర బోధే గురువు యొక్క తత్వం అని, ఆ (గురువనే) మాటకు అర్థం" అని.

అట్టి బోధ నిరంతరం జరుగుతుంటే మనకు అందదేమి? మనపై ప్రభావముండదేమి? మనకర్థం కాదేమి? దానికి సమాధానం సాయి చెప్పకనే చెప్పారు. ఒకసారి ఒక స్టేషన్‌మాస్టర్ సాయి వద్దకు వచ్చాడు. అతడొచ్చేటప్పటికి బాబా కుండలు బోర్లిస్తున్నారు. ఆ స్టేషన్‌మాస్టర్‌కు సాయిపై విశ్వాసం లేదు. అతను సాయితో "ఎందుకలా చేస్తున్నారు" అని అడిగితే, సాయి "ఏం చేయను? నా దగ్గరకు వచ్చే కుండలన్నీ తలక్రిందులుగా వొస్తున్నాయి" అన్నారు. ఆ వాక్యంతో స్టేషన్‌మాస్టర్‌కు వివేకం ఉదయించి భక్తి, జిజ్ఞాసలు మేల్కొన్నాయి. లీలామృతంలో మాస్టర్‌గారు అంటారు "విశ్వాసంతోగానీ, లేక కనీసం జిజ్ఞాసతోగానీ సద్గురువువద్దకు వచ్చే హృదయాలు సరియైన కుండలు; వాటిని నింపవచ్చు" అని. మనకు సద్గురువందించే నిరంతర బోధ అందట్లేదంటే మన హృదయాలు తలక్రిందులుగా ఉన్నాయని గుర్తించడం అవసరం.

అట్టి నిరంతర బోధను అందుకోవడానికి, అర్థం చేసుకోవడానికి వీలు పడాలంటే బోధ యొక్క తత్వం కూడా తెలియాలి. అదెలా తెలుస్తుంది? బోర్లించిన మన మనస్సులనే కుండలను సరి చేసుకునేదెలా?

**2. అట్టి సూత్రాల సమన్వయ రూపమైన ఆయన జీవితాన్ని గురించి, తత్త్వాన్ని గురించి చింతన చేస్తే అవే లక్షణాలు మనలోనూ సంస్కారాలుగా ఏర్పడి, బలపడి మనకు తెలియకనే మనకు సహజమైన పరమ శ్రేయస్సును చేకూరుస్తాయి.**

సకల విశ్వము తన రూపంగా గల సాయి మనకు వారి సూక్తుల రూపంలో తమ తత్త్వాన్ని, మనకు ఆచరణ యోగ్యాన్ని తెలిపారు. తిరిగి తమ లీలల రూపంలో జీవిత విధానంగాను వాటి సమన్వయాన్ని ఆచరణ పూర్వకంగా నిరూపించారు. అట్టి వారి జీవిత చరిత్రను శ్రద్ధగా పారాయణ చేస్తూ వారందించిన బోధను తిరిగి తిరిగి మననం చేస్కుంటూ, వాటి ననుసరించి మన జీవితాన్ని తగు రీతిన మలచుకోవడానికి ప్రయత్నించడమే మనం చేయవలసినదన్నమాట. అలా చేస్తూ ఉంటే సర్వాంతర్యామి శ్రీ సాయి అన్న భావం మనస్సులో నిలువనారంభిస్తుంది. ఆ స్ఫురణ ఎంత సంపూర్ణంగా, నిర్దుష్టంగా నిశ్చలంగా నిలుస్తుందో అంతగా సహస్ర ముఖాలతో వారు చేసే నిరంతర బోధ మనకర్థమై మనకు ఆచరణయోగ్యాన్ని అనుక్షణం ప్రభోదిస్తుంది. దానిననుసరించి ఆచరించే కొద్దీ అంతకంతకూ మనలో పరివర్తన కలిగి ఆధ్యాత్మికోన్నతికి దారి తీస్తుంది. సర్వమూ వారి రూపమే అన్న అనుభవం కలగడం ఆధ్యాత్మికతకు పరాకాష్ఠ. దానికి మనమెంతగా దగ్గర అవుతుంటే అంతకంతకూ యావద్విశ్వం పట్ల మనకు భక్తి శ్రద్ధలేర్పడతాయి. అన్ని రూపాల్లో ఉన్న సాయికి అనుక్షణం చేసే సేవలా మారుతుంది మన ఆచరణ. సద్గురువు అనే సాయి సద్గుణ సంకీర్తనగా మారుతుంది మన ప్రతి మాట. వారి ధ్యానంగా మారుతుంది మన ప్రతీ ఆలోచన. అలా ఎంతగా మారుతూ ఉంటుందో అంతగా సాయి తత్త్వము, వారి కృప అనుభవం అవుతాయి. ధర్మాచరణ అంతకంతకూ సహజమవుతుంది.

**3. నకల జీవులకు శ్రేయన్కరమైన రీతిన మన జీవితాలను సంస్కరించుకోవడమే కదా సాయి బోధించిన మార్గము.**

ఆ మార్గంలో మనమెంత ముందుకు కొనసాగితే అంతగా మన జీవితం సకల జీవులకు శ్రేయస్కరమైన రీతిన మలచబడుతుంది.

అంటే, ఇంకోలా చెప్పాలంటే, వారి జీవిత చరిత్రను వారి తత్త్వాన్ని ఎంతగా చింతన చేస్తామో అంతగా మనలో సత్వగుణం ఏర్పడుతుంది. ఎంతగా సత్వగుణం ఏర్పడుతుందో, అంతగా ధర్మాచరణ కుదురుతుంది. నిర్దుష్టమైన ధర్మాచరణే సకల జీవులకు శ్రేయస్కరమైన జీవన విధానంగా నెలకొంటుంది. అంతకంతకూవారి కృప మనకు అనుభవమవుతుంది. అందుకే గురుదేవులంటారు "సకల విశ్వరూపుడైన సాయియే సత్యము. సకలజన శ్రేయస్కరమైన సాయి బోధయే మార్గము. సాయిని లక్ష్యంగా బోధను మార్గంగా స్వీకరించిన వారి చేత సాధించబడిన శ్రేయస్సే శాశ్వత జీవితము".

అదే గురుదేవులు మనకాచరించి చూపిన జీవిత విధానము. అట్టి తత్త్వానికి, జీవన విధానానికి నిలువుటద్దమే పూజ్య గురుదేవులు. అందుకని సాయిని లేక మాస్టర్‌ని అనుసరించడమంటే, అట్టి జీవన విధానాన్ని మనమలవరచుకోవడమేనన్నమాట. సాయిని సకల విశ్వరూపుడని మనం గుర్తించి, గుర్తుంచుకొంటున్నామా? వారి జీవితాన్ని, తత్త్వాన్ని తగినంతగా చింతన చేస్తున్నామా, లేదా? నిరంతరం వారినుండి వర్షించే అమృత బోధను అందుకుంటున్నామా లేదా? సకల జీవులకు శ్రేయస్కరమైన రీతిన మన జీవితాన్ని మలచుకోవటానికి ప్రయత్నిస్తున్నామా లేదా? అట్టి అవగాహన మనలో బలపడటానికి ఆచార్యుల వారు రచించిన అనేక గ్రంధాలు శ్రద్ధతో చదువుతున్నామా లేదా! ప్రశ్నలను తిరిగి తిరిగి మనకు మనమే వేసుకుంటూ తగిన విధంగా మన జీవితాలను సంస్కరించుకుంటూ ముందుకు సాగడమే మన కర్తవ్యము. ఆ పైన సాయి కృప. ఇదే సాయి మాస్టర్ మనకందించిన శుద్ధ మార్గము. దానిననుసరించి సర్వులమూ సాయి సన్నిధిని చేరుదుము గాక.

# బాబా తోడుగా వుండి నడిపిస్తున్నారు !!!

"ద్వారకామాయి అనుభవమంటపం"

మా బాబుకి 3 సం॥లు వయస్సునప్పుడు (ఇప్పుడు 10 సం॥లు) మూడవ అంతస్తు నుంచి క్రిందపడిపోయాడు. పూర్తిగా స్పృహ పోయింది. అందరూ చేరి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాము. అప్పుడు అక్కడ ఉన్న వాళ్లందరూ "మీరు షిరిడీ వస్తామని మ్రొక్కుకోండి, బాబా చరిత్ర పారాయణ చేయండి" అన్నారు. సరేనని చెప్పాను. పది రోజుల తరువాత మా అబ్బాయి నార్మల్ కి వచ్చాడు. హాస్పిటల్ నుంచి ఇంటికి ఆటోలో వస్తూ, దీనికి సంబంధించిన మాటలు, మాట్లాడుకుంటూవుంటే, ఆ ఆటో డ్రైవర్ (అతను ముస్లిమ్), మేము అడగకుండానే, మీ బాబుకి పూర్వ జన్మకి సంబంధించిన దోషం వుంది, మీరు బాబా గుడిలో చపాతీలు పంచండి, ఇంకా విడిగా గోధుమలు ఎవరికైనా పంచండి, కొన్ని పక్షులను కొని వాటిని మళ్ళీ స్వేచ్ఛగా వదిలి పెట్టండి అని చెప్పాడు. అతను చెప్పిన వాటిలో చపాతీలు, గోధుమలు పంచడం చేసాము కాని, పక్షులది కుదరలేదు. బాబా దయవల్ల మా బాబు ఆరోగ్యంగానే ఉన్నారు. అయితే మా అమ్మమ్మగారు సత్యసాయిబాబా భక్తురాలు కాని, నాకు మాత్రం షిరిడీ సాయి సచ్చరిత్ర యిచ్చి, నిత్యం పారాయణ చేసుకోమన్నారు. మా బాబు పడిన వెంటనే అందరూ బాబా గురించే చెప్పారు, ఆటో ఆయన కూడా బాబా గుడిలో ప్రసాదం పంచమన్నాడు. ఇవన్నీ చూస్తే చిన్నప్పటి నుండి బాబా తోడుగా వుండి నడిపిస్తున్నారు అనిపిస్తుంది. ఈ మధ్య కాలంలో సాయి మాస్టర్ సత్సంగ సభ్యులతో పరిచయం అయ్యి, శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర, పారాయణ చేస్తున్నాను. నాతో పాటు మా ఇంట్లో కూడా పారాయణ చేస్తున్నారు.

శ్రీమతి ఆర్.రాజేశ్వరి, హైదరాబాద్

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీగురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాధ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 20-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |

| | |
|---|---|
| దత్తావతార మహత్త్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 35-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 30-00 |
| అవధూ త శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 22-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Sree Guru Charitra | 50-00 |
| The Supreme Master (Shri Akkalkot Maharaj) | 50-00 |
| Sai Baba of Shirdi and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

www.saibharadwaja.org
www.saimasterforums.org